పెళ్లి కంటే సరైన బంధమే నాకు ముఖ్యం: నిత్యా మేనన్

8

Neti Velugu

నేటి వెలుగు

నేటి సమాజం... నేటి వెలుగు...

RNI NO. TELTEL/2023/88559

తెలుగు దినపత్రిక

www.epaper.netivelugu.com

netivelugu63@gmail.com



నల్గొండ | సంపుటి : 3 | సంచిక : 222 | పేజీలు : 8 | నవంబర్ 28 శనివారం 2026 | వెల రూ. 4.00/-

NALGONDA | VOL:3 | ISSUE: 222 | PAGES:8 | SATURDAY NOVEMBER 28 2026 | Rs. 4:00

2బీహెచ్‌కే కాలనీల్లో మౌలిక వసతులకు రూ.53 కోట్ల కేటాయింపు


తాగునీరు, డ్రైనేజీ వ్యవస్థల ఏర్పాటుకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్

17 ప్రాంతాల్లో పనులకు రూ.53.12 కోట్ల అంచనా వ్యయం

కనెక్షన్ ఛార్జీలు రాకముందే పనులు ప్రారంభించేందుకు అనుమతి

హైదరాబాద్, నవంబరు 27:

తెలంగాణ ప్రభుత్వం 2బీహెచ్‌కే కాలనీల్లో మౌలిక వసతుల కల్పనపై కీలక నిర్ణయం తీసుకుంది. క్యూర్ పరిధిలోని 2బీహెచ్‌కే ఇళ్లకు తాగునీరు, డ్రైనేజీ సౌకర్యాలు కల్పించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఆయా కాలనీల్లో నీటి సరఫరా, మురుగునీటి వ్యవస్థల ఏర్పాటుకు అవసరమైన పనులు చేపట్టేందుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఇందుకు సంబంధించిన టెండర్ల ప్రక్రియ ప్రారంభించేందుకు కూడా



అనుమతించింది. 17 ప్రాంతాల్లో పనులకు అనుమతి

(మిగతా 2వ పేజీలో..)

నషా ముక్త్ భారత్.. కిషన్ రెడ్డి పాదయాత్రలో డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించిన నాగార్జున

నషా ముక్త్ భారత్.. డ్రగ్స్ కు వ్యతిరేకంగా కేంద్రం జాతీయ కార్యక్రమం

కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో హైదరాబాద్ లో పాదయాత్ర

డ్రగ్స్ రహిత భారత్ కోసం ప్రతిజ్ఞ చేయించిన నాగార్జున

యాత్రకు మద్దతు తెలిపిన పలువురు సినీ ప్రముఖులు

మాదకద్రవ్యాల వినియోగానికి వ్యతిరేకంగా కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి హైదరాబాద్‌లో చేపట్టిన పాదయాత్రకు సినీ ప్రముఖుల నుంచి విశేష మద్దతు లభిస్తోంది. 'హైదరాబాద్ వాక్స్ ఫర్ నషా ముక్త్ భారత్' పేరుతో మూడు రోజులుగా జరుగుతున్న ఈ యాత్ర చివరి రోజైన శుక్రవారం, ప్రముఖ నటుడు నాగార్జున అక్కినేని పాల్గొన్నారు. ఈ సందర్భంగా డ్రగ్స్ రహిత సమాజం కోసం ఆయన ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. అంబర్‌పేట్‌లో ప్రారంభమైన ఈ పాదయాత్ర ముగింపు రోజున అమీర్‌పేట వద్ద నాగార్జున జత కలిశారు. ఆయనతో పాటు నటుడు సాయికుమార్, దర్శకుడు బోయపాటి శ్రీను, హాస్యనటుడు శివారెడ్డి కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ

(మిగతా 2వ పేజీలో..)



హైదరాబాద్‌లో కుండపోత.. పదేళ్లలో నవంబర్‌లో ఇదే అత్యధిక వర్షం!



హైదరాబాద్ నగరాన్ని ఈరోజు తెల్లవారుజామున భారీ వర్షం ముంచెత్తింది. గడిచిన పదేళ్లలో నవంబర్ నెలలో ఇదే అత్యధిక వర్షపాతం కావడం గమనార్హం. దాదాపు 28 రోజుల తర్వాత కురిసిన ఈ కుండపోత వానతో నగరవాసులు ఇబ్బందులు పడ్డారు. అర్ధరాత్రి 12 గంటల నుంచి 3 గంటల మధ్య కురిసిన వర్షానికి కూకట్‌పల్లి, సఫిల్‌గూడ, షేక్‌పేట్, చర్లపల్లి, బోరబండ, మాదాపూర్ వంటి ప్రాంతాల్లో 60-80 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.బంగాళాఖాతంలో ఏర్పడిన ద్రోణి ప్రభావంతో తెలంగాణలోని పలు ప్రాంతాల్లో ఈ వర్షాలు కురిశాయి. తెలంగాణ అ బి. వృద్ధి, ప్రణాళికా సొసైటీ డేటా ప్రకారం, కూకట్‌పల్లి, నిజాంపేట్, సఫిల్‌గూడలో కొద్ది గంటల్లోనే 7 సెం.మీ. పైగా వర్షం పడింది. దీంతో పలు లోతట్టు ప్రాంతాలు

(మిగతా 2వ పేజీలో..)

చాలా కాలం తర్వాత మంచి సినిమా చూశా: కేటీఆర్

'ఆకాశంలో ఒక తార' సినిమా అద్భుతంగా ఉందన్న కేటీఆర్

తొలి చిత్రంతోనే అద్భుత ప్రతిభ చాటిన సాత్విక వీరవల్లికి ప్రత్యేక అభినందనలు తెలిపిన కేటీఆర్

ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చిన 'ఆకాశంలో ఒక తార' సినిమాపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశంసల జల్లు కురిపించారు. సినిమా ఎంతో బాగుందని, చాలా కాలం తర్వాత ఇంతటి అందమైన చిత్రాన్ని చూశానని ఆయన సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నారు. ఈ మేరకు చిత్ర బృందాన్ని

(మిగతా 2వ పేజీలో..)



తెలంగాణ భూ సర్వే దేశానికే ఆదర్శంగా నిలుస్తుంది

ప్రతి జిల్లాలో వేగంగా భూముల సర్వే చేపడుతున్నాం

క్యూఆర్ కోడ్‌తో వాటర్ ప్రూఫ్ పట్టాదారు పాస్‌బుక్‌లు

18 నెలల్లో రాష్ట్రవ్యాప్తంగా సర్వే పూర్తి చేస్తాం: మంత్రి పొంగులేటి

హైదరాబాద్, నవంబర్ 27:

తెలంగాణలో చేపడుతున్న భూ సర్వే దేశానికే రోల్ మోడల్‌గా నిలుస్తుందని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో భూ సర్వే వేగంగా కొనసాగుతోందని, మరో ఏడాదిన్నరలో రాష్ట్రవ్యాప్తంగా సర్వే ప్రక్రియను పూర్తి చేస్తామని తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లో విలేకరులతో ఇష్టాగోష్టిగా మాట్లాడిన ఆయన, భూ సర్వే పూర్తయితే భూములకు సంబంధించిన సాదాబైనామా సమస్యలు పరిష్కారమవుతాయని పేర్కొన్నారు.

కేంద్రం తెలంగాణపై వివక్ష చూపుతోంది

తెలంగాణపై కేంద్ర ప్రభుత్వం సవతితల్లి ప్రేమ చూపిస్తోందని పొంగులేటి విమర్శించారు. రాష్ట్రంలోని వివిధ శాఖల విషయంలో కేంద్రం వివక్ష ప్రదర్శిస్తోందని ఆరోపించారు. కరువు పరిస్థితులపై అధ్యయనం చేసేందుకు కేంద్ర బృందం వచ్చినప్పటికీ, ఆశించిన స్థాయిలో నిధులు వస్తాయనే నమ్మకం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 13 లక్షల ఇందిరమ్మ ఇళ్లు కోరితే కేంద్రం కేవలం రెండు లక్షల ఇళ్లనే కేటాయించిందని అసంతృప్తి వ్యక్తం చేశారు.

భూములకు ప్రత్యేక ఖాతా నంబర్లు



రాష్ట్రంలో భూ సర్వే పూర్తయిన తర్వాత సర్వే నంబర్లకు బదులుగా ప్రత్యేక ఖాతా నంబర్లు కేటాయించనున్నట్లు మంత్రి వెల్లడించారు. అటవీ శాఖ పరిధిలోని 26 లక్షల భూమికి సర్వే అనంతరం క్లియర్ టైటిల్ ఇవ్వనున్నట్లు తెలిపారు. భూమి తక్కువగా ఉన్న అర్హుల సమస్యలను సర్వే చివరి దశలో పరిష్కరిస్తామని పేర్కొన్నారు. వచ్చే మంగళవారం నుంచి మూడు రోజులపాటు ప్రతి జిల్లాపై విడివిడిగా సమీక్షలు నిర్వహించనున్నట్లు చెప్పారు.

(మిగతా 2వ పేజీలో..)

వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో త్వరలో వైద్య సేవలు

అన్ని రకాల స్పెషాలిటీ, సూపర్ స్పెషాలిటీ వైద్యం అందుబాటులోకి

ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యుల హాజరుపై మంత్రి అసంతృప్తి

హైదరాబాద్, నవంబర్ 27:

వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో త్వరలో వైద్య సేవలు ప్రారంభించనున్నట్లు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ వెల్లడించారు. ఆస్పత్రిలో అన్ని

(మిగతా 2వ పేజీలో..)



ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌కు భారీ ఏర్పాట్లు



హైదరాబాద్, నవంబర్ 27: ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్, ఖేలో ఇండియా యూత్ గేమ్స్ నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. ఈ రెండు కార్యక్రమాల ఏర్పాట్లపై శుక్రవారం సచివాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ కార్యక్రమాలు విజయవంతమయ్యేలా చూడాలని సూచించారు.

డిసెంబర్ 8న రక్షణ రంగ ఎక్స్‌పో, ఎయిర్ షో

డిసెంబర్ 8న భారత్ ఫ్యూచర్ సిటీలో రక్షణ రంగ ఎక్స్‌పో, ఎయిర్ షో నిర్వహించనున్నట్లు సీఎస్ తెలిపారు. ఈ కార్యక్రమాలను వీక్షించేందుకు పెద్ద సంఖ్యలో విద్యార్థులను తీసుకురావాలని అధికారులకు సూచించారు. విద్యార్థుల రాకపోకలకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయాలని టీజీఎస్ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు భోజనం, అల్పాహారం, తాగునీరు వంటి అవసరమైన సదుపాయాలు కల్పించాలని స్పష్టం చేశారు.

డిసెంబర్ 11న ఖేలో ఇండియా ప్రారంభోత్సవం

డిసెంబర్ 11న ఖేలో ఇండియా యూత్ గేమ్స్ ప్రారంభోత్సవం జరగనున్న నేపథ్యంలో విద్యార్థుల హాజరుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సంజయ్ జాజు సూచించారు. ప్రారంభ, ముగింపు వేడుకలకు సంబంధించిన ఏర్పాట్లలో ఎలాంటి లోపాలు లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

8 వేల మంది క్రీడాకారులకు వసతి ఏర్పాట్లు

(మిగతా 2వ పేజీలో..)

గంధమల్ల రిజర్వాయర్ పనులు ఏడాదిలో పూర్తి

రైతులకు అందుబాటులోకి తెస్తాం: మంత్రి కోమటిరెడ్డి

అలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యకు మంత్రి పదవి కోసం కృషి చేస్తా

వాసాలమర్రిపై కేసీఆర్ హామీని ప్రస్తావిస్తూ విమర్శలు

యాదాద్రి, నవంబర్ 27:

గంధమల్ల రిజర్వాయర్ నిర్మాణాన్ని ఏడాదిలోపు పూర్తి చేసి రైతులకు అందుబాటులోకి

(మిగతా 2వ పేజీలో..)



నేటి వెలుగు
నేటి సమాజం... నేటి వెలుగు...
తెలుగు దినపత్రిక
పి. నవీన్ కుమార్ గౌడ్
ఎడిటర్ & పబ్లిషర్

సంపాదకీయం

తినే తిండిలోనూ కల్తీనా?

లాభాల వేటలో ప్రజారోగ్యంతో చెలగాటం.. ఆహార భద్రతపై కఠిన నిఘా అవసరం

మనిషికి ఆహారం ప్రాథమిక అవసరం. ఆరోగ్యంగా జీవించాలంటే స్వచ్ఛమైన, పోషక విలువలున్న ఆహారం తీసుకోవాలి. కానీ నేటి పరిస్థితుల్లో మనం తింటున్న ఆహారం నిజంగా నాణ్యమైనదేనా? కొనుగోలు చేస్తున్న పాలు, నూనెలు, పప్పులు, మసాలా దినుసులు, తినుబండారాల్లో కల్తీ లేదని నమ్మగలమా? అన్న సందేహాలు ప్రజలను వెంటాడుతున్నాయి. అధిక లాభాల కోసం కొందరు వ్యాపారులు నాణ్యతకు తిలోదకాలిస్తూ ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారు. ఆహారం ద్వారా వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉన్నప్పటికీ, కల్తీ నిరోధక చర్యలు ఆశించిన స్థాయిలో కనిపించడం లేదు.

లాభాల కోసం ప్రమాదకర పద్ధతులు

కొన్ని చోట్ల పాలలో ఇతర పదార్థాలు కలపడం, వంట నూనెల్లో నాసిరకం నూనెలు కల్తీ చేయడం, మసాలా దినుసుల్లో రంగులు, నిషేధిత పదార్థాలు కలపడం వంటి అక్రమాలు జరుగుతున్నాయనే ఫిర్యాదులు వస్తున్నాయి. తక్కువ ధరకు ముడిసరుకు కొనుగోలు చేసి, ఆకర్షణీయమైన ప్యాకింగ్‌తో అధిక ధరలకు విక్రయించడం మరో సమస్య. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు, అనారోగ్యంతో ఉన్నవారు కల్తీ ఆహారం వల్ల ఎక్కువగా ప్రభావితమయ్యే ప్రమాదం ఉంది. ఆహార నాణ్యతపై రాజీ పడటం అంటే ప్రజల ప్రాణాలతో చెలగాటమాడటమే.

ఆకర్షణీయమైన ప్యాకింగ్.. లోపల నాణ్యతపై సందేహాలు

సూపర్ మార్కెట్లు, ఆన్‌లైన్ విక్రయ వేదికలు, వీధి వ్యాపారాలు.. ఇలా ఆహార ఉత్పత్తులు అనేక మార్గాల్లో ప్రజలకు చేరుతున్నాయి. రంగురంగుల ప్యాకెట్లు, ఆకర్షణీయమైన ప్రకటనలు చూసి వినియోగదారులు వస్తువులను కొనుగోలు చేస్తున్నారు. కానీ ప్యాకింగ్ బాగున్నంత మాత్రాన ఆహారం నాణ్యమైనదని భావించకూడదు. తయారీ తేదీ, గడువు తేదీ, పదార్థాల వివరాలు, నిల్వ విధానం, ఆహార భద్రత లైసెన్స్ వంటి అంశాలను పరిశీలించాలి. తక్కువ ధరకు లభిస్తోందని తెలియని ఉత్పత్తులను కొనుగోలు చేయడం ప్రమాదకరం.

తనిఖీలు కాగితాలకే పరిమితం కాకూడదు

ఆహార భద్రతకు సంబంధించిన చట్టాలు ఉన్నప్పటికీ వాటి అమలు సమర్థంగా ఉండాలి. ఆహార భద్రత, ప్రమాణాల చట్టం--2006 ప్రకారం నిబంధనలు ఉల్లంఘించే వారిపై చర్యలు తీసుకునే అవకాశం ఉంది. అయితే కేవలం పండుగల సమయంలో లేదా కల్తీ ఘటనలు వెలుగులోకి వచ్చినప్పుడే తనిఖీలు నిర్వహించడం సరిపోదు. తయారీ కేంద్రాలు, గోదాములు, హోటళ్లు, రెస్టారెంట్లు, వీధి ఆహార విక్రయ కేంద్రాల్లో నిరంతర తనిఖీలు జరగాలి. అనుమానాస్పద నమూనాలను సేకరించి ప్రయోగశాలల్లో పరీక్షించాలి. నిబంధనలు ఉల్లంఘించిన సంస్థలపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలి.

వినియోగదారుల అప్రమత్తత కూడా అవసరం

ప్రభుత్వాలు, అధికారులు చర్యలు తీసుకోవడంతో పాటు ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలి. పాడైన వాసన, రంగు లేదా రుచి కనిపించే ఆహారాన్ని వినియోగించకూడదు. నాణ్యతపై అనుమానం ఉంటే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలి. కొనుగోలు చేసిన వస్తువుల రశీదులు, ప్యాకింగ్ వివరాలు భద్రపరచుకోవాలి. ఆహార కల్తీపై ఫిర్యాదులు చేయడానికి ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఏఐ) అందించే అధికారిక మార్గాలను వినియోగించుకోవాలి. సమస్యను గుర్తించినా మౌనంగా ఉండటం వల్ల కల్తీ వ్యాపారులకు మరింత అవకాశం ఇచ్చినట్లవుతుంది.

స్వచ్ఛమైన ఆహారం హక్కు.. వ్యాపారుల బాధ్యత

ఆహారం విక్రయించడం కేవలం వ్యాపారం మాత్రమే కాదు.. ప్రజల ఆరోగ్యానికి సంబంధించిన బాధ్యత కూడా. వ్యాపారులు నాణ్యతా ప్రమాణాలను పాటించాలి. తయారీ నుంచి నిల్వ, రవాణా, విక్రయం వరకు ప్రతి దశలో పరిశుభ్రతను కాపాడాలి. తక్కువ ధరకు ఉత్పత్తులు అందించాలనే పేరుతో నాణ్యతను తగ్గించకూడదు. ప్రభుత్వం తనిఖీలను బలోపేతం చేయడంతో పాటు ఆహార పరీక్షా ప్రయోగశాలల సామర్థ్యాన్ని పెంచాలి. కల్తీని గుర్తించినప్పుడు చర్యలు వేగంగా, పారదర్శకంగా ఉండాలి.

ఆరోగ్యమే సంపద.. దానితో వ్యాపారం వద్దు

ప్రజలు కష్టపడి సంపాదించిన డబ్బుతో కొనుగోలు చేసే ఆహారం వారికి ఆరోగ్యాన్ని అందించాలి కానీ అనారోగ్యాన్ని మిగల్చకూడదు. కల్తీని అరికట్టడం ఒక్క శాఖ బాధ్యత కాదు. అధికారులు, వ్యాపారులు, వినియోగదారులు సమిష్టిగా బాధ్యత తీసుకోవాలి. లాభం కోసం నాణ్యతను తాకట్టు పెట్టే ధోరణికి అడ్డుకట్ట పడాలి. ప్రతి కుటుంబానికి సురక్షితమైన ఆహారం అందుబాటులో ఉండేలా వ్యవస్థ పనిచేయాలి. ప్రజల ప్రాణాల కంటే వ్యాపార లాభాలే ముఖ్యమనే ఆలోచనకు సమాజంలో స్థానం ఉండకూడదు. తినే తిండిపై నమ్మకం కోల్పోయే పరిస్థితి రాకుండా ఆహార భద్రతను ప్రభుత్వాలు అత్యంత ప్రాధాన్యంగా తీసుకోవాలి.

చాలా కాలం తర్వాత మంచి సినిమా చూశా: కేటీఆర్

మొదటి పేజీ తరువాయి)

అభినందిస్తూ 'ఎక్స్'లో ఒక పోస్ట్ పెట్టారు.ఈ సందర్భంగా కేటీఆర్ స్పందిస్తూ.. "అసాధ్యమైన కలలు కనడమే కాదు... వాటిని నిజం చేసుకోవడానికి చేసే స్ఫూర్తిదాయకమైన ప్రయాణాన్ని ఈ చిత్రం ఎంతో అందంగా ఆవిష్కరించింది. 'ఆకాశంలో ఒక తార' చాలా సరళంగా, అద్భుతంగా ఉంది. చాలా కాలం తర్వాత ఇంతటి అందమైన సినిమాను చూశాను. ముఖ్యంగా దుల్కర్ సల్మాన్, శ్రుతిహాసన్ తమ అద్భుతమైన నటనతో ఆకట్టుకున్నారు. ఇక ఈ సినిమాతో పరిచయమైన సాత్విక తొలి చిత్రంతోనే అద్భుతమైన ప్రతిభను చాటుకున్నారు. ఆమె నటనకు ప్రత్యేకంగా అభినందనలు. దర్శకుడు పవన్ సాధినేని కూడా అద్భుతమైన పనితీరును కనబరిచారు. అద్భుతమైన సినిమా అందించిన చిత్ర బృందానికి అభినందనలు" అని రాసుకొచ్చారు. పవన్ సాధినేని దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో దుల్కర్ సల్మాన్, సాత్విక వీరవల్లి ప్రధాన పాత్రలు పోషించగా, శ్రుతిహాసన్ కీలక పాత్రలో మెరిశారు. గీతా ఆర్ట్స్, స్వప్న సినిమా సంయుక్తంగా సమర్పించిన ఈ చిత్రం మంచి టాక్ సాధించింది.

ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌కు భారీ ఏర్పాట్లు

మొదటి పేజీ తరువాయి)

ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌లో సుమారు 8 వేల మంది క్రీడాకారులు పాల్గొనే అవకాశం ఉందని సీఎస్ తెలిపారు. వారికి అవసరమైన వసతి, రవాణా, భద్రత, వైద్య సదుపాయాలను సమర్థంగా కల్పించాలని సూచించారు. క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సంబంధిత శాఖలు సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు.

విస్తృత మీడియా కవరేజీకి చర్యలు

క్రీడా పోటీలకు విస్తృతంగా మీడియా కవరేజీ కల్పించేలా చర్యలు తీసుకోవాలని సంజయ్ జాజు అధికారులకు సూచించారు. గ్లోబల్ సమ్మిట్, ఖేలో ఇండియా యూత్ గేమ్స్ నిర్వహణలో ప్రతి శాఖ తన బాధ్యతలను సమర్థంగా నిర్వర్తించాలని స్పష్టం చేశారు.

తెలంగాణ భూ సర్వే దేశానికే ఆదర్శంగా నిలుస్తుంది

మొదటి పేజీ తరువాయి)

క్యూఆర్ కోడ్‌తో కొత్త పాస్‌బుక్‌లు

రైతులకు వాటర్ ప్రూఫ్ పట్టాదారు పాస్‌బుక్‌లను ఉచితంగా అందించనున్నట్లు పొంగులేటి తెలిపారు. వీటిపై క్యూఆర్ కోడ్ ఉంటుందని, దాన్ని స్కాన్ చేస్తే భూములకు సంబంధించిన వివరాలు, మ్యాపింగ్ సమాచారం అందుబాటులోకి వస్తాయని వివరించారు. రెండు రకాల పాస్‌బుక్‌లు ఇవ్వనున్నట్లు చెప్పారు. ఒకటి సాధారణ పాస్‌బుక్ కాగా, మరొకటి వ్యవసాయానికి సంబంధించినదని తెలిపారు. ఈ పాస్‌బుక్‌లు రెండు వేర్వేరు రంగుల్లో ఉంటాయని, వాటిపై ఫొటోలు ఉండవని స్పష్టం చేశారు.

డిసెంబర్ నాటికి 2,300 గ్రామాల్లో సర్వే పూర్తి

ఈ ఏడాది డిసెంబర్ నాటికి 2,300 గ్రామాల్లో భూ సర్వే పూర్తవుతుందని మంత్రి వెల్లడించారు. వచ్చే నెలలో తాను గ్రామాల్లో పర్యటించి, రాత్రివేళల్లో అక్కడే బస చేస్తూ ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకుంటానని చెప్పారు. భూ సర్వే ప్రక్రియలో ప్రజలకు ఎదురయ్యే ఇబ్బందులను పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

బీఆర్ఎస్ అక్రమాలను బయటపెడతాం

బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఫాంహౌస్ లెక్కలు, ధరణికి సంబంధించిన సీఐడీ కేసు దాదాపు తుది దశకు చేరుకున్నాయని పొంగులేటి పేర్కొన్నారు. సాంకేతిక అంశాలు, సరైన లెక్కల ఆధారంగా బీఆర్ఎస్ హయాంలో జరిగిన అక్రమాలను బయటపెడతామని స్పష్టం చేశారు. సర్వేల పేరుతో బీఆర్ఎస్ నేతలు పగటి కలలు కంటున్నారని వ్యాఖ్యానించారు. భూ సర్వే లక్ష్యాన్ని తమ ప్రభుత్వమే సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

2బీహెచ్‌కే కాలనీలో మౌలిక వసతులకు రూ.53 కోట్లు కేటాయింపు

మొదటి పేజీ తరువాయి)

రూ.53.12 కోట్ల అంచనా వ్యయాన్ని ప్రభుత్వం నిర్ణయించింది. సాధ్యమైన ప్రాంతాల్లో కనెక్షన్ ఛార్జీలు వసూలు కాకముందే పనులు ప్రారంభించేందుకు అనుమతించింది. దీంతో 2బీహెచ్‌కే కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు మార్గం సుగమమైంది.

నీటి సరఫరా నెట్‌వర్క్‌కు రూ.17.73 కోట్లు

తాగునీటి సరఫరా వ్యవస్థను అభివృద్ధి చేసేందుకు రూ.17.73 కోట్లు కేటాయించాలని నిర్ణయించింది. అలాగే డ్రైనేజీ నెట్‌వర్క్ అభివృద్ధికి రూ.2.27 కోట్ల అంచనా వ్యయాన్ని నిర్ధారించింది. ఈ పనుల ద్వారా ఆయా కాలనీల్లో నీటి సరఫరా, మురుగునీటి నిర్వహణకు అవసరమైన వ్యవస్థలను ఏర్పాటు చేయనున్నారు.

జీవో 1037 విడుదల

ఈ మేరకు జలమండలి ఎండీ తీసుకున్న నిర్ణయానికి ఆమోదం తెలుపుతూ తెలంగాణ ప్రభుత్వం జీవో నంబర్ 1037ను విడుదల చేసింది. టెండర్ల ప్రక్రియకు అనుమతి ఇవ్వడంతో పనుల ప్రారంభానికి అవసరమైన చర్యలు చేపట్టేందుకు అధికారులకు అవకాశం కల్పించింది.

వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో త్వరలో వైద్య సేవలు

మొదటి పేజీ తరువాయి)

రకాల స్పెషాలిటీ, సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలను అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. త్వరలోనే ఈ ఆస్పత్రిని ప్రజలకు అంకితం చేయనున్నట్లు ప్రకటించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో వైద్య సేవల పరిస్థితిపై అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు.

వైద్యుల హాజరుపై ప్రత్యేక దృష్టి

ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యుల హాజరు తక్కువగా ఉండటంపై మంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు. కమ్యూనిటీ హెల్త్ సెంటర్ల (సీహెచ్‌సీలు), ఏరియా ఆస్పత్రుల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని డీసీహెచ్ఎస్‌లను ఆదేశించారు. ఇటీవల 1,616 మంది వైద్యులను సీహెచ్‌సీలు, ఏరియా ఆస్పత్రుల్లో నియమించిన విషయాన్ని గుర్తుచేశారు. నియామకాలతో పాటు ఆస్పత్రుల్లో వైద్య సేవలు సక్రమంగా అందేలా అధికారులు పర్యవేక్షించాలని సూచించారు.

90 శాతం వైద్యం స్థానికంగానే అందించాలి

ప్రజలకు అవసరమైన వైద్య సేవల్లో 90 శాతం స్థానికంగానే అందించాలన్నది ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. వైద్య సేవల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మెడికల్ ఆఫీసర్లు, ఆస్పత్రి సూపరింటెండెంట్లు, డీఎంహెచ్‌వోలు, డీసీహెచ్ఎస్‌లు బాధ్యతగా పనిచేయాలని సూచించారు.

ప్రత్యేక వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

సికిల్ సెల్ అనీమియా, తలసేమియా, హీమోఫీలియా కేసులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు. జిల్లాల్లోని బస్తీ దవాఖానలకు సెంట్రల్ మెడిసినల్ స్టోర్స్ నుంచే మందులు సరఫరా చేస్తామని తెలిపారు. అన్ని సబ్ సెంటర్లను ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలుగా అప్‌గ్రేడ్ చేయాలని సూచించారు.

అధికారుల పనితీరుపై సమీక్ష

త్వరలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో పర్యటించనున్నట్లు మంత్రి తెలిపారు. తన పర్యటనలోగా జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రుల పనితీరు మెరుగుపడాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

గంధమల్ల రిజర్వాయర్ పనులు ఏడాదిలో పూర్తి

మొదటి పేజీ తరువాయి)

తీసుకొస్తామని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వెల్లడించారు. శుక్రవారం యాదాద్రి భువనగిరి జిల్లాలోని యాదాద్రిలో ఆయన మాట్లాడుతూ ఈ హామీ ఇచ్చారు. రిజర్వాయర్ పూర్తయితే రైతులకు ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు.

వాసాలమర్రిపై కేసీఆర్‌కు విమర్శలు

వాసాలమర్రి అభివృద్ధి విషయంలో బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌పై మంత్రి విమర్శలు చేశారు. శ్మశానవాటిక అడ్డుగా ఉందని చెబుతూ వాసాలమర్రిని అభివృద్ధి చేస్తానని ప్రకటించిన కేసీఆర్.. రహదారులు వేయించుకున్న తర్వాత అక్కడికి రావడం మానేశారని ఆరోపించారు. పచ్చకామెర్లు వచ్చిన వారికి లోకమంతా పచ్చగా కనిపించినట్లుగా బీఆర్ఎస్ నాయకుల తీరు ఉందని వ్యాఖ్యానించారు.

అయిలయ్యకు మంత్రి పదవి కోసం కృషి చేస్తా

అలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య వ్యక్తిత్వాన్ని ప్రస్తావిస్తూ కోమటిరెడ్డి ప్రశంసించారు. ఎమ్మెల్యే కాకముందు ఎలా ఉన్నారో, ఇప్పుడు కూడా అలాగే ఉన్నారని అన్నారు. అయిలయ్యను మరోసారి ఎమ్మెల్యేగా గెలిపిస్తే మంత్రి పదవి ఇప్పించేందుకు కృషి చేస్తానని ప్రకటించారు. అవసరమైతే తనకు పదవి రాకపోయినా అయిలయ్య కోసం పోరాడతానని పేర్కొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు సహకారం

అయిలయ్యను దృష్టిలో ఉంచుకునే ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాల సందర్భంగా తన వంతు సహాయం చేస్తున్నానని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. నియోజకవర్గంలో ఆయన చేస్తున్న పనులకు తన మద్దతు ఉంటుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

హైదరాబాద్‌లో కుండపోత.. పదేళ్లలో నవంబర్‌లో ఇదే అత్యధిక వర్షం!

మొదటి పేజీ తరువాయి)

జలమయమయ్యాయి, కొన్నిచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. హైదరాబాద్ సమీపంలోని భువనగిరిలో 12 సెం.మీ., ఆలేరులో 10 సెం.మీ. వర్షపాతం నమోదైంది.ఈ నెల 28 నుంచి రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు తగ్గుముఖం పడతాయని వాతావరణ శాఖ తెలిపింది. అయితే, నవంబర్ 29, 30, డిసెంబర్ 1 తేదీల్లో హైదరాబాద్ సహా పలు జిల్లాల్లో చలి తీవ్రత పెరిగే అవకాశం ఉంది. రాబోయే ఐదు రోజుల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు 2 నుంచి 4 డిగ్రీల సెల్సియస్ వరకు పడిపోవచ్చని భారత వాతావరణ శాఖ సూచించింది. దీంతో ప్రజలు చలి నుంచి రక్షణ పొందేందుకు సిద్ధమవ్వాలని అధికారులు హెచ్చరిస్తున్నారు.

నషా ముక్త్ భారత్.. కిషన్ రెడ్డి పాదయాత్రలో డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించిన నాగార్జున

మొదటి పేజీ తరువాయి)

సంకల్పించిన 'నషా ముక్త్ భారత్' లక్ష్యానికి అనుగుణంగా ఈ యాత్ర జరగడం అభినందనీయమన్నారు. ఈ బృహత్ కార్యక్రమంలో సమాజంలోని అన్ని వర్గాల ప్రజలు భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు."వ్యక్తిగతంగా నేను డ్రగ్స్‌కు దూరంగా ఉండటమే కాకుండా, నా కుటుంబాన్ని, స్నేహితులను, చుట్టూ ఉన్న సమాజాన్ని కూడా డ్రగ్స్ బారిన పడకుండా కాపాడేందుకు అన్ని విధాలా ప్రయత్నిస్తాను" అని నాగార్జున ప్రతిజ్ఞ చేయించారు. నటుడు సాయికుమార్ 'నషా ముక్త్ భారత్ – మేం చేసి తీరుతాం' అంటూ నినాదాలతో హోరెత్తించారు.ఈ సందర్భంగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ, ఢిల్లీలో అత్యవసర కేబినెట్ సమావేశం ఉన్నప్పటికీ, పాదయాత్రను కొనసాగించాలని ప్రధానమంత్రి తనకు సూచించారని తెలిపారు. ప్రజల నుంచి యాత్రకు అద్భుతమైన స్పందన వస్తోందన్నారు. జూబ్లీహిల్స్‌లో జరిగే ముగింపు కార్యక్రమానికి మెగాస్టార్ చిరంజీవి, ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకుడు శ్రీశ్రీ రవిశంకర్ హాజరవుతారని వెల్లడించారు. 'నషా ముక్త్ భారత్ అభియాన్'లో భాగంగా జరుగుతున్న ఈ కార్యక్రమంలో ఇప్పటికే బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపీచంద్ వంటి ప్రముఖులు కూడా పాల్గొని తమ మద్దతు తెలిపారు. యువతను మాదకద్రవ్యాల మహమ్మారి నుంచి రక్షించడానికి సామూహిక బాధ్యతతో పనిచేయాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు.

ఈనెల 30 నుంచి నల్లగొండలో ఎన్ పిఎల్-7 క్రికెట్ సమరం

64 జట్లతో 20 రోజులపాటు హోరాహోరీ పోటీలు

విజేతకు రూ.2,33,333 నగదు బహుమతి

నల్లగొండ, నవంబర్ 27 (నేటి వెలుగు):



నల్లగొండ యువ క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు నల్లగొండ ప్రీమియర్ లీగ్ (ఎన్ పిఎల్) సీజన్-7 మరోసారి వేదిక కానుంది. ఈనెల 30వ తేదీ నుంచి నల్లగొండలోని ఎన్జీ కళాశాల మైదానంలో ప్రతిష్టాత్మక క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం కానుందని నల్లగొండ మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్ తెలిపారు.శుక్రవారం ఎన్జీ కళాశాల మైదానంలో టోర్నమెంట్ ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ముందుగా ఈనెల 28వ తేదీ నుంచి ప్రారంభం కావాల్సిన పోటీలను ఒకరోజు వాయిదా వేసినట్లు వెల్లడించారు. ఈనెల 29న ఎన్జీ కళాశాలలో ఎస్సై, సీఐ పరీక్షలు నిర్వహించనున్న నేపథ్యంలో ఎలాంటి అంతరాయం లేకుండా 30వ తేదీ నుంచి క్రికెట్ పోటీలను నిర్వహించాలని నిర్ణయించినట్లు వివరించారు.రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సహకారంతో కోమటిరెడ్డి ప్రతీక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ టోర్నమెంట్ను ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మొత్తం 64 జట్లు పాల్గొననున్న ఈ పోటీలు 20 రోజులపాటు హోరాహోరీగా కొనసాగనున్నాయని పేర్కొన్నారు.టోర్నమెంట్లో విజేతగా నిలిచిన జట్టుకు రూ.2,33,333 నగదు బహుమతి, రన్నరప్ జట్టుకు రూ.1,22,222 నగదు బహుమతి అందజేయనున్నట్లు తెలిపారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు ప్రత్యేక బహుమతులు కూడా అందించనున్నామని, పాల్గొనే క్రీడాకారులందరికీ ఉచిత భోజన సౌకర్యం కల్పిస్తున్నట్లు వెల్లడించారు.యువతలో క్రీడాస్ఫూర్తి, పోటీతత్వాన్ని పెంపొందించడంతో పాటు స్థానిక క్రికెట్ క్రీడాకారులకు తమ ప్రతిభను నిరూపించుకునే అవకాశం కల్పించడమే ఎన్ పిఎల్-7 ప్రధాన ఉద్దేశమని అన్నారు. నల్లగొండలో క్రికెట్కు మంచి ఆదరణ ఉందని, ఇలాంటి టోర్నమెంట్లు యువ క్రీడాకారులకు ఎంతో ప్రోత్సాహాన్నిస్తాయని పేర్కొన్నారు.ఎన్ పిఎల్-7 ప్రారంభోత్సవానికి నల్లగొండ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి, జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్, జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ హాజరుకానున్నట్లు తెలిపారు.టోర్నమెంట్ నిర్వహణకు సహకరిస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ గుమ్ముల మోహన్ రెడ్డి, కార్పొరేటర్లు, ఆర్గనైజర్లు, నిర్వాహకులు, మంత్రి అభిమానులు, క్రీడాభిమానులకు అబ్బగోని రమేష్ గౌడ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.నల్లగొండ జిల్లా క్రీడాభిమానులు, యువత, క్రికెట్ ప్రేమికులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఎన్ పిఎల్-7 క్రికెట్ టోర్నమెంట్ను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఏర్పాట్ల పరిశీలనలోలి ఆర్గనైజర్లు, మాజీ కౌన్సిలర్ ప్రదీప్ నాయక్, బోనగిరి ప్రభాకర్, పాలకూరి శ్రీధర్ గౌడ్, కోమటిరెడ్డి శేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల బ్యాక్‌లాగ్ ఉద్యోగ ఖాళీల భర్తీకి చర్యలు చేపట్టాలి





ప్రత్యేక నియామక ప్రక్రియ ద్వారా పోస్టుల భర్తీకి అదనపు కలెక్టర్ ఆదేశం

మేడ్చల్--మల్కాజిగిరి, నవంబర్ 27 (నేటి వెలుగు):

జిల్లాలో దివ్యాంగులకు కేటాయించిన బ్యాక్‌లాగ్ ఉద్యోగ ఖాళీలను గుర్తించి, ప్రత్యేక నియామక ప్రక్రియ ద్వారా భర్తీ చేసేందుకు అన్ని ప్రభుత్వ శాఖలు తక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఆదేశించారు.శుక్రవారం మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్‌లో మహిళా, శిశు, దివ్యాంగులు మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో దివ్యాంగుల బ్యాక్‌లాగ్ ఉద్యోగ ఖాళీల గుర్తింపు, భర్తీపై సమీక్ష సమావేశం నిర్వహించారు. అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా సంక్షేమ అధికారి, వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా, యూనిట్ అధికారులు, దివ్యాంగుల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ శాఖల్లో దివ్యాంగులకు నిబంధనల ప్రకారం కేటాయించిన రిజర్వేషన్లను అమలు చేయాలని, గతంలో భర్తీ చేయకుండా మిగిలిపోయిన బ్యాక్‌లాగ్ పోస్టులను గుర్తించి ప్రత్యేక నియామకాల ద్వారా భర్తీ చేయాలని సూచించారు.ప్రభుత్వం G.O.Rt.No.19, తేదీ 18.08.2026 ద్వారా దివ్యాంగుల బ్యాక్‌లాగ్ ఖాళీల భర్తీ గడువును 31.03.2028 వరకు పొడిగించిన నేపథ్యంలో జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖలు అక్టోబర్ 2016 నుంచి ఇప్పటివరకు భర్తీ కాకుండా మిగిలిపోయిన ఖాళీల పూర్తి వివరాలను సమర్పించాలని ఆదేశించారు.ముఖ్యంగా రోస్టర్ పాయింట్లు 6 (దృష్టి లోపం), 31 (వినికిడి లోపం), 56 (ఆర్థోపెడిక్/చలన వైకల్యం), 82 (ఆటిజం, మేధో వైకల్యం, నిర్దిష్ట అభ్యసన వైకల్యం, మానసిక అనారోగ్యం, బహుళ వైకల్యాలు) ప్రకారం ఖాళీలను పరిశీలించి, కేటగిరీల వారీగా వివరాలు అందించాలని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో జిల్లా సంక్షేమ అధికారి, మహిళా, శిశు, దివ్యాంగులు మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధికారులు, వివిధ ప్రభుత్వ శాఖల ప్రతినిధులు, దివ్యాంగుల సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సూర్యాపేట మున్సిపల్ అభివృద్ధికి నిధులు కేటాయించాలి

పురపాలక పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శిని కలిసి పలు ప్రతిపాదనలు అందజేసిన మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మాధి.

సూర్యాపేట పట్టణం నవంబర్ 27 (నేటి వెలుగు) :

పట్టణ అభివృద్ధికి అవసరమైన నిధులు కేటాయించడంతో పాటు మున్సిపాలిటీలో ఖాళీగా ఉన్న కీలక పోస్టులను భర్తీ చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మాధి కోరారు. ఈ మేరకు పురపాలక పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి శ్రీదేవి ని కలిసి పట్టణ అభివృద్ధి, పరిపాలనా అవసరాలకు సంబంధించిన పలు ప్రతిపాదనలు, వినతిపత్రాలను అందజేశారు. మున్సిపాలిటీలో రెగ్యులర్ టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ (టీపీఓ)ను నియమించాలని, ఖాళీగా ఉన్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ పోస్టును భర్తీ చేయాలని కోరారు. సిబ్బంది కొరత కారణంగా పట్టణ ప్రణాళిక, పారిశుధ్య నిర్వహణలో ఎదురయ్యే ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఈ నియామకాలు చేపట్టాల్సిన అవసరం ఉందని వివరించారు.అలాగే అమృత్ పథకంలో భాగంగా దురాజ్‌పల్లి చెరువును పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలని ప్రతిపాదించారు. పెండింగ్‌లో ఉన్న నూతన మాస్టర్ ప్లాన్‌కు ప్రభుత్వం నుంచి త్వరితగతిన అనుమతులు ఇప్పించాలని కోరారు. పట్టణంలో చేపట్టాల్సిన వివిధ అభివృద్ధి పనులకు అవసరమైన నిధులు కేటాయించి, పనులు ముందుకు సాగేలా సహకరించాలని సీడీఎంఏకు విజ్ఞప్తి చేశారు. సూర్యాపేట పట్టణాన్ని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేయడంతో పాటు మౌలిక సదుపాయాలను మెరుగుపరిచేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని నివేదిత లక్ష్మాధి ఈ సందర్భంగా కోరారు.



భూ సమస్యలకు శాశ్వత పరిష్కారమే భూ భారతి లక్ష్యం

భూ రికార్డుల్లో పారదర్శకతకు ఠీ-సర్వే దోహదం

ఘట్కేసర్, నవంబర్ 27 (నేటి వెలుగు):



రైతుల భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు భూ రికార్డుల్లో పారదర్శకత తీసుకురావడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం భూ భారతి చట్టం, భూముల ఠీ-సర్వే ప్రక్రియను చేపట్టిందని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ డి. విజయేందర్ రెడ్డి అన్నారు.శుక్రవారం ఘట్కేసర్ మండలం పడమటి సాయిగూడ గ్రామంలో నిర్వహించిన భూ భారతి--భూ సర్వే ప్రత్యేక గ్రామసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామంలోని ప్రతి అంగుళం భూమిని పారదర్శకంగా సర్వే చేసి, భూ వివాదాలకు తావులేకుండా పక్కాగా హద్దులు నిర్ణయిస్తామని స్పష్టం చేశారు.ఠీ-సర్వే ప్రక్రియ పూర్తయిన అనంతరం క్యూఆర్ కోడ్, నక్షా (మ్యాప్), భూ ఆధార్ అనుసంధానంతో కూడిన నూతన పట్టాదారు పాస్ పుస్తకాలను రైతులకు అందజేయనున్నట్లు వివరించారు. భూ రికార్డుల నిర్వహణలో పారదర్శకత పెంపొందించడం, భవిష్యత్తులో భూ వివాదాలు తలెత్తకుండా చూడటం ఈ ప్రక్రియ ప్రధాన ఉద్దేశమని తెలిపారు.ఈ కార్యక్రమంలో కీసర ఆర్డీవో నల్ల వెంకట రెడ్డి, ఘట్కేసర్ తహసీల్దార్ చంద్రశేఖర్, రెవెన్యూ సిబ్బంది, గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

గుండ్రాంపల్లి సింగిల్ విండో చైర్మన్‌గా బండ అంజయ్య ఎన్నిక

నూతన చైర్మన్, 13 మంది డైరెక్టర్లకు ఎమ్మెల్యే వేముల వీరేశం అభినందనలు

నకిరేకల్, నవంబర్ 27 (నేటి వెలుగు):



చిట్యాల మండలం గుండ్రాంపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం () చైర్మన్‌గా బండ అంజయ్య నూతనంగా ఎన్నికయ్యారు. ఆయనతో పాటు నూతనంగా ఎన్నికైన 13 మంది డైరెక్టర్లు ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశంను నకిరేకల్ క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేముల వీరేశం నూతన చైర్మన్ బండ అంజయ్యతో పాటు డైరెక్టర్లను శాలువాలతో సత్కరించి అభినందించారు.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సహకార సంఘం పాలకవర్గం రైతుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తూ సంఘాన్ని మరింత బలోపేతం చేయాలని సూచించారు. రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు, పంట రుణాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. సహకార సంఘం అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, రైతులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

నూతన వన్‌టౌన్ సీఐ క్రాంతి కుమార్‌కు మాల మహానాడు ఘన సన్మానం

నల్గొండ, నవంబర్ 27 (నేటి వెలుగు):



నల్లగొండ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సీఐ క్రాంతి కుమార్‌ను మాల మహానాడు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాల మహానాడు నాయకులు సీఐ క్రాంతి కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి పుష్పగుచ్ఛంతో అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు సంక్షేమ సంఘం వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు రేకల సైదులు, మాలల ఐక్యవేదిక వర్కింగ్ ప్రెసిడెంట్ అద్దంకి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా కార్యవర్గ సమావేశం ఘనంగా నిర్వహణ

పార్టీ బలోపేతానికి సమష్టిగా కృషి చేయాలి: ముఖ్య నాయకుల పిలుపు

నల్గొండ, నవంబర్ 27 (నేటి వెలుగు):



భారతీయ జనతా పార్టీ నల్గొండ జిల్లా కార్యవర్గ సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర సహ సంఘటన మంత్రి దశరథ్ జీ, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ బూర నర్సయ్య గౌడ్, రాష్ట్ర కార్యదర్శి తోటపల్లి రవి, జిల్లా ఇంచార్జ్ ఉదయ ప్రతాప్, బీజేపీ నల్గొండ జిల్లా అధ్యక్షులు డాక్టర్ నాగం వర్షిత్ రెడ్డి హాజరయ్యారు.ఈ సందర్భంగా ముఖ్య నాయకులు మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. పార్టీ సిద్ధాంతాలు, ఆశయాలను ప్రతి ఒక్కరికీ వివరించాలని సూచించారు.రాబోయే రోజుల్లో నల్గొండ జిల్లాలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. ప్రతి గ్రామంలో పార్టీని ప్రజలకు చేరువ చేస్తూ, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేయాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించడంతో పాటు పార్టీ అప్పగించిన బాధ్యతలను ప్రతి ఒక్కరూ సమర్థవంతంగా నిర్వహించాలని దిశానిర్దేశం చేశారు.ఈ సమావేశంలో పార్టీ భవిష్యత్ కార్యాచరణ, సంస్థాగత బలోపేతం, రాబోయే రోజుల్లో నిర్వహించాల్సిన కార్యక్రమాలపై విస్తృతంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో పలువురు బీజేపీ నాయకులు, జిల్లా కార్యవర్గ సభ్యులు, మండల అధ్యక్షులు, పార్టీ శ్రేణులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నేటి వెలుగు
నేటి సమాజం... నేటి వెలుగు...
తెలుగు దినపత్రిక
పి. సవీన్ కుమార్ గౌడ్

ఎస్సీ నిరుద్యోగ యువతకు ఉచిత ఉపాధి శిక్షణ

మూడు నెలల పాటు వెబ్ టెక్నాలజీ, జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్ కోర్సుల్లో శిక్షణ

రంగారెడ్డి, నవంబర్ 27 (నేటి వెలుగు):

రంగారెడ్డి జిల్లాలోని నిరుద్యోగ షెడ్యూల్డ్ కులాల (ఎస్సీ) యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో మూడు నెలల పాటు ఉచిత వేతన ఉపాధి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్, జిల్లా షెడ్యూల్డ్ కులాల సేవా సహకార అభివృద్ధి సంఘం లిమిటెడ్ చైర్మన్ ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ షెడ్యూల్డ్ కులాల సహకార అభివృద్ధి సంస్థ లిమిటెడ్ (ఎస్సీ కార్పొరేషన్), హైదరాబాద్ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఆదేశాల మేరకు ఎల్.బీ.నగర్‌లోని నై-ఎంఎస్ఎంఈ సంస్థ ఆధ్వర్యంలో ఈ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో భాగంగా వెబ్ టెక్నాలజీ, జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్ కోర్సుల్లో యువతకు ఉచిత శిక్షణ అందించనున్నారు. శిక్షణ ద్వారా యువతను ఉద్యోగాలకు సిద్ధం చేయడంతో పాటు వివిధ ప్రభుత్వ స్వయం ఉపాధి పథకాల ద్వారా ఆర్థికంగా ఎదిగేందుకు అవకాశాలు కల్పించడం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు.

అర్హతలు ఇవే..

అభ్యర్థులు తెలంగాణ రాష్ట్రానికి చెందిన ఎస్సీ వర్గానికి చెందిన వారై ఉండాలి.

వయస్సు 18 నుంచి 35 సంవత్సరాల మధ్య ఉండాలి.

ఎంపిక చేసుకున్న కోర్సుకు అవసరమైన విద్యార్హత కలిగి ఉండాలి.

పట్టణ ప్రాంతాల్లో కుటుంబ వార్షిక ఆదాయం రూ. 2 లక్షలకు మించకూడదు.

ఆధార్ కార్డు తప్పనిసరిగా కలిగి ఉండాలి.

దరఖాస్తు విధానం:

అర్హత కలిగిన అభ్యర్థులు http://tgscbhavitha.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. మరిన్ని వివరాల కోసం 9494293610 నంబర్‌ను సంప్రదించి దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు తెలిపారు. ఈ ఉచిత శిక్షణ అవకాశాన్ని అర్హులైన ఎస్సీ నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకొని పెద్ద సంఖ్యలో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్, జిల్లా షెడ్యూల్డ్ కులాల సేవా సహకార అభివృద్ధి సంఘం లిమిటెడ్ చైర్మన్ విజ్ఞప్తి చేశారు.

బీజేపీకి బీసీల ఉసురు తగులుతుంది

- **బీసీ కులగణన చేపట్టకపోతే రాజకీయంగా పుట్టగతులు ఉండవు: బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్**

హైదరాబాద్ నవంబర్ 27 (నేటి వెలుగు):



దేశవ్యాప్తంగా బీసీ కులగణన చేపట్టకపోతే బీజేపీకి రాజకీయంగా పుట్టగతులు ఉండవని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ హెచ్చరించారు. బీసీలకు ఉపయోగపడని డీలిమిటేషన్ బిల్లు, మహిళా రిజర్వేషన్ల బిల్లుకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలుపుతున్న బీజేపీ ప్రభుత్వం, జనగణనలో ఓబీసీ కాలమ్ చేర్చడానికి మాత్రం ఎందుకు వెనుకడుగు వేస్తోందని ఆయన ప్రశ్నించారు. గత ఆరు నెలలుగా దేశవ్యాప్తంగా బీసీలు ఓబీసీ కాలమ్ చేర్చాలని పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం కనీసం స్పందించకపోవడం సిగ్గుచేటని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీలకు ఇంత అన్యాయం జరుగుతున్నా బీజేపీకి చెందిన బీసీ ఎంపీలు ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. దేశంలో బీసీల జనాభా, సామాజిక స్థితిగతులపై స్పష్టమైన గణాంకాలు అందుబాటులోకి రావాలంటే కేంద్ర ప్రభుత్వం ఓబీసీ కులగణన చేపట్టాలని డిమాండ్ చేశారు. బీసీల హక్కులు, వాటా, సామాజిక న్యాయం కోసం దేశవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా ఓబీసీ కులగణన నిర్వహించకపోతే దేశంలోని సుమారు 80 కోట్ల మంది బీసీలంతా ఏకమై జాతీయ జనగణనను బహిష్కరించాలని జాజుల లింగంగౌడ్ పిలుపునిచ్చారు.

తెలంగాణలో ఆర్టీఈ అమలుపై ఎన్‌హెచ్‌ఆర్‌సీ సీరియస్

ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం ఉచిత సీట్ల అమలుపై కమిషన్ ఆదేశాలు

విద్యార్థుల హక్కుల ఉల్లంఘనగా పరిగణన.. 14 రోజుల్లో నివేదిక ఇవ్వాలని విద్యాశాఖకు నోటీసులు

రెడ్డి శేఖర్ ఫిర్యాదుతో స్పందించిన జాతీయ మానవ హక్కుల కమిషన్

హైదరాబాద్ / హనుమకొండ, నవంబర్ 27 (నేటి వెలుగు):



తెలంగాణ రాష్ట్రంలో విద్యా హక్కు చట్టం (ఆర్టీఈ--2009) అమలు తీరుపై జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ) స్పందించింది. ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో ఆర్థికంగా వెనుకబడిన, బలహీన వర్గాల పిల్లలకు 25 శాతం సీట్లు కేటాయించాలన్న నిబంధన అమలుపై వచ్చిన ఫిర్యాదును పరిశీలించిన కమిషన్.. ఈ వ్యవహారంలో విద్యార్థుల హక్కులకు భంగం కలుగుతోందన్న ఆరోపణలను తీవ్రంగా పరిగణించింది. ఈ అంశంపై విచారణ జరిపి 14 రోజుల్లోగా చర్యల నివేదిక సమర్పించాలని రాష్ట్ర విద్యాశాఖ ముఖ్య కార్యదర్శిని ఆదేశించింది.

అసలేం జరిగింది?

సామాజిక కార్యకర్త రెడ్డి శేఖర్ గత ఏడాది మే 25న జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు ఈ మేరకు ఫిర్యాదు చేశారు. ఆరు నుంచి 14 ఏళ్లలోపు పిల్లలందరికీ ఉచిత, నిర్బంధ విద్య అందించేందుకు కేంద్ర ప్రభుత్వం 2009లో విద్యా హక్కు చట్టాన్ని తీసుకువచ్చిందని, 2010 ఏప్రిల్ 1 నుంచి దేశవ్యాప్తంగా అమల్లోకి వచ్చిందని తన ఫిర్యాదులో పేర్కొన్నారు. అయితే 2014 జూన్ 2న తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి ఆర్టీఈ చట్టంలోని సెక్షన్ 12(1)(ఎ) సమర్థవంతంగా అమలు కావడం లేదని ఆరోపించారు. ఈ నిబంధన ప్రకారం ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో ప్రవేశ స్థాయిలో కనీసం 25 శాతం సీట్లను ఆర్థికంగా వెనుకబడిన, బలహీన వర్గాల పిల్లలకు కేటాయించాల్సి ఉంటుందని వివరించారు. ఈ నిబంధన అమలు కాకపోవడంతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఇతర బలహీన వర్గాలు, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చెందిన చిన్నారులు నాణ్యమైన విద్యను పొందే అవకాశాలను కోల్పోతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇది భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 21ఊ కల్పించిన విద్యా హక్కుకు విఘాతం కలిగిస్తోందని కమిషన్ దృష్టికి తీసుకెళ్లారు.

14 రోజుల్లో నివేదిక సమర్పించాలని ఆదేశం

రెడ్డి శేఖర్ సమర్పించిన ఫిర్యాదును నవంబర్ 27న పరిశీలించిన ఎన్‌హెచ్‌ఆర్‌సీ, అందులో పేర్కొన్న అంశాలపై స్పందించింది. ఈ మేరకు కమిషన్ డిప్యూటీ రిజిస్ట్రార్ (లా) స్పర్శ్ అగర్వాల్ రాష్ట్ర విద్యాశాఖ ముఖ్య కార్యదర్శికి, పాఠశాల విద్యాశాఖ సంచాలకుడికి అధికారిక నోటీసులు జారీ చేసినట్లు ఫిర్యాదుదారుడు వెల్లడించారు. నోటీసులు అందిన తేదీ నుంచి 14 రోజుల్లోగా ఈ వ్యవహారంపై విచారణ జరిపి, తీసుకున్న చర్యలతో కూడిన సమగ్ర నివేదికను కమిషన్‌కు సమర్పించాలని ఆదేశించినట్లు తెలిపారు.

పేద విద్యార్థులకు ఉచిత విద్యపై ఆశలు

జాతీయ మానవ హక్కుల కమిషన్ జోక్యంతోనైనా రాష్ట్రంలో ఆర్టీఈ చట్టం సమర్థవంతంగా అమలవుతుందని విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యావేత్తలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం ఉచిత ప్రవేశాల నిబంధన అమలైతే పేద, బలహీన వర్గాల పిల్లలకు నాణ్యమైన విద్య అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని అభిప్రాయపడుతున్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి అర్హులైన విద్యార్థులకు విద్యా హక్కు చట్టం ద్వారా లబ్ధి చేకూర్చాలని కోరుతున్నారు.

రుద్రమదేవి వర్ధంతిని ప్రభుత్వ అధికారిక కార్యక్రమంగా నిర్వహించేందుకు కృషి చేస్తా





- **చందుపట్ల చరిత్రను సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తా: ఎమ్మెల్యే వేముల వీరేశం**
- **శిలాశాసనానికి ఘన నివాళులర్పించిన ఎమ్మెల్యే**
- **గ్రామ పంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో వర్ధంతి సభ**

నకిరేకల్, నవంబర్ 27 (నేటి వెలుగు):

కాకతీయ వీరనారి రాణి రుద్రమదేవి వర్ధంతిని ఇకపై రాష్ట్ర ప్రభుత్వం తరఫున అధికారికంగా నిర్వహించేలా కృషి చేస్తానని ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం తెలిపారు. రాణి రుద్రమదేవి 737వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం నకిరేకల్ మండలం చందుపట్ల గ్రామంలో ఆమె మరణ వివరాలను తెలియజేసే చారిత్రక శిలాశాసనం వద్ద ఎమ్మెల్యే ఘనంగా నివాళులర్పించారు. అనంతరం గ్రామ పంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో నిర్వహించిన వర్ధంతి సభకు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాణి రుద్రమదేవి చందుపట్ల గ్రామంలోనే వీరమరణం పొందారనే విషయానికి ఇక్కడి చారిత్రక ఆనవాళ్లు, శిలాశాసనాలు సజీవ సాక్ష్యాలుగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. గతంలో గ్రామ యువకులు, పెద్దలు చేసిన కృషితో పురావస్తు శాఖ అధికారులు ఇక్కడి శాసనాలను పరిశీలించి, రాణి రుద్రమదేవి మరణానికి సంబంధించిన చారిత్రక వివరాలను నిర్ధారించారని గుర్తుచేశారు.

చందుపట్ల చరిత్రకు ప్రభుత్వ గుర్తింపు తీసుకొస్తాం



వరంగల్ కోట కేంద్రంగా నిర్వహించే కాకతీయ ఉత్సవాలు, ఇతర అధికారిక కార్యక్రమాల తరహాలోనే చందుపట్లలో కూడా రాణి రుద్రమదేవి వర్ధంతి వేడుకలను ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించాలని గ్రామ సర్పంచ్ కోరినట్లు ఎమ్మెల్యే తెలిపారు. వర్ధంతి సందర్భంగా నాటక ప్రదర్శనలు ఏర్పాటు చేయడం, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొనడం సంతోషకరమని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. అనంతరం గ్రామ పంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే వేముల వీరేశంకు రాణి రుద్రమదేవి జ్ఞాపిక అందజేసి ఘనంగా సన్మానించారు. సర్పంచ్ ద్యాగోజు లతా వెంకటాచారి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశ్వరరావు, మేదవరపు అశోక్ రావు, ఉప సర్పంచ్ మంజుల శ్రీను, మార్కెట్ చైర్మన్ గుత్తా మంజుల, గాథాగొని కొండయ్య, నరేందర్, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు మలిగి రెడ్డి రంగారెడ్డి, యేసు రత్నం, యాస కరుణాకర్, రెడ్డి, వివేకానంద యువజన మండలి అధ్యక్షుడు కొండ కోటేష్, గ్రామ పాలకవర్గ సభ్యులు, యువజన సంఘాల నాయకులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ సేవా కార్యక్రమాలను విస్తృతం చేయాలి





జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్

నల్గొండ, నవంబర్ 27 (నేటి వెలుగు):

ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ పాలకవర్గ సభ్యులందరూ నిబద్ధతతో, సమష్టి కృషితో ప్రజాసేవకు అంకితం కావాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. సమాజ సేవలో రెడ్‌క్రాస్ కీలక పాత్ర పోషించాలని, మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రజా సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. శుక్రవారం కలెక్టరేట్ ఆవరణలోని ఉదయాదిత్య భవన్‌లో నిర్వహించిన జిల్లా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నూతనంగా ఎన్నికైన పాలకవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. రెడ్‌క్రాస్ సొసైటీకి సమాజంలో ప్రత్యేక గుర్తింపు, విశ్వసనీయత ఉన్నాయని, సంస్థ చేపట్టే ప్రతి కార్యక్రమం ప్రజల్లో నమ్మకాన్ని పెంపొందించేలా ఉండాలని అన్నారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండేలా నషాముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. జిల్లాలో రక్తహీనత నిర్మూలనకు రెడ్‌క్రాస్ భాగస్వామ్యం కావాలని, ముఖ్యంగా బాలికలు, గర్భిణులు, చిన్నారుల్లో రక్తహీనత నివారణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని తెలిపారు. రక్త నిల్వల అవసరాలను దృష్టిలో ఉంచుకుని బ్లడ్ బ్యాంక్ సేవలను బలోపేతం చేయాలని, విద్యాసంస్థలు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో రక్తదాన శిబిరాలు నిర్వహించాలని కోరారు. నర్సింగ్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ జపాన్, జర్మనీ వంటి దేశాల్లో నర్సింగ్ రంగంలో మంచి ఉద్యోగావకాశాలు ఉన్నాయని తెలిపారు. విద్యార్థులు జపనీస్, జర్మన్ వంటి విదేశీ భాషలను నేర్చుకుని తమ ఉద్యోగ అవకాశాలను విస్తరించుకోవాలని సూచించారు. ప్రభుత్వ సహకారంతో డిసెంబర్ నెలలో విదేశీ భాషల శిక్షణ కార్యక్రమాలను ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. రానున్న కాలంలో ఎల్‌నినో ప్రభావంతో వాతావరణ మార్పులు, వర్షపాతం లోటు వంటి పరిస్థితులు ఎదురయ్యే అవకాశాలున్నాయని పేర్కొంటూ నీటి సంరక్షణకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. నీటిని పొదుపుగా వినియోగించడంతో పాటు ఈ అంశంపై కుటుంబ సభ్యులు, స్నేహితులకు విద్యార్థులు అవగాహన కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా నూతన రెడ్‌క్రాస్ చైర్మన్ డాక్టర్ హేమలత మాట్లాడుతూ నల్గొండ జిల్లాలో రెడ్‌క్రాస్ సేవలను మరింత విస్తరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ రెడ్‌క్రాస్ వైస్ చైర్మన్ శ్రీకాంత్, డాక్టర్ పుల్లారావు, రాష్ట్ర కమిటీ సభ్యుడు మంచుకొండ భిక్షమయ్య, కుంభం జ్యోతి రెడ్డి, నూతన పాలకవర్గ సభ్యులు, నర్సింగ్ కళాశాలల విద్యార్థులు, అధ్యాపకులు, సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి చట్టసభల్లో గళమెత్తుతా

ఇప్పటివరకు మీలో ఒకడిగా ఉన్నా.. ఇకముందు కూడా మీలోనే, మీతోనే ఉంటా.. ఆశీర్వదించండి: ఎమ్మెల్సీ అభ్యర్థి సుంకరి బిక్షం గౌడ్

మునుగోడు నవంబర్ 27 (నేటి వెలుగు):

ఉమ్మడి నల్గొండ జిల్లాలో ఉపాధ్యాయ సంఘాల బాధ్యుడిగా దశాబ్దంన్నర కాలంగా ఉపాధ్యాయుల మధ్య ఉంటూ, సంఘాలకు అతీతంగా వారి సమస్యల పరిష్కారానికి కృషి చేశానని గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి సుంకరి బిక్షం గౌడ్ అన్నారు. ఇకముందు కూడా ఉపాధ్యాయుల్లో ఒకడిగా, వారితోనే ఉంటూ సేవలందించేందుకు తనను ఎమ్మెల్సీగా ఆశీర్వదించాలని కోరారు. ఈరోజు మునుగోడు మండలంలోని జడ్పీహెచ్ఎస్ కొంపల్లిలో భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులకు నిర్వహించిన సబ్జెక్ట్ కాంప్లెక్స్ సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజకీయ పార్టీలు తమ అభ్యర్థిగా పోటీ చేసేందుకు అవకాశం కల్పించినా, కల్పించకపోయినా పీఆర్టీయూ ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎన్నికల బరిలో ఉంటానని స్పష్టం చేశారు. ఉపాధ్యాయుల సమస్యలపై పూర్తి అవగాహన ఉన్న తనను గెలిపించుకోవాల్సిన బాధ్యత ఉపాధ్యాయులందరిపై ఉందన్నారు. మునుగోడు, చిట్యాల, నార్కట్‌పల్లి మండలాల ఉపాధ్యాయులు తనకు మద్దతుగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి చట్టసభల్లో వారి గొంతుకను బలంగా వినిపించడమే ఏకైక మార్గమని పేర్కొన్నారు. ఇప్పటివరకు మీలో ఒకడిగా ఉన్నానని, ఇకముందు కూడా మీలోనే ఉంటూ మీ సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని సుంకరి బిక్షం గౌడ్ భరోసా ఇచ్చారు. ఈ సమావేశంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు వెంకటనారాయణ, పీఆర్టీయూ రాష్ట్ర నాయకులు విజయనగరం శ్రీనివాస్, కోటయ్య, బాలరాజు, వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయ మిత్రులు పాల్గొన్నారు.



రూ.30 కోట్లతో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల నూతన భవనానికి శంకుస్థాపన







విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తీసుకొస్తున్నాం: మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

ఆధునిక సాంకేతిక విద్యతో పాటు నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాల కల్పనే లక్ష్యం

రంగారెడ్డి జిల్లా, నవంబర్ 27 (నేటి వెలుగు):

షాద్‌నగర్ నియోజకవర్గంలోని లింగారెడ్డిగూడ గ్రామంలో రూ.30 కోట్ల వ్యయంతో నిర్మించనున్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల నూతన భవన నిర్మాణానికి శుక్రవారం రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకరయ్యతో కలిసి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యా వ్యవస్థను అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా తీర్చిదిద్దేందుకు ప్రజా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఆధునిక సాంకేతిక విద్యను అందించడంతో పాటు పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.రాష్ట్రవ్యాప్తంగా 65 ఐటీఐ కళాశాలలను సుమారు రూ.2,500 కోట్లతో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా ఆధునికీకరిస్తున్నామని తెలిపారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, రోబోటిక్స్, మెషిన్ లెర్నింగ్ వంటి అధునాతన సాంకేతిక రంగాల్లో విద్యార్థులకు శిక్షణ అందిస్తున్నట్లు వెల్లడించారు. నైపుణ్య ఆధారిత విద్యతో యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించేందుకు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకరయ్య మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో మంజూరైన పాలిటెక్నిక్ కళాశాల నిర్మాణం కార్యరూపం దాల్చలేదని, కళాశాల ప్రిన్సిపాల్ పలుమార్లు చేసిన విజ్ఞప్తుల మేరకు భూ కేటాయింపు, అనుమతులు, నిధుల మంజూరు కోసం ప్రత్యేకంగా కృషి చేసినట్లు తెలిపారు. ఇందుకోసం ప్రభుత్వం రూ.30 కోట్లు మంజూరు చేసిందని వెల్లడించారు.షాద్‌నగర్ నియోజకవర్గంలో విద్యారంగ అభివృద్ధికి సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగుతున్నామని, పాలిటెక్నిక్ కళాశాలతో పాటు ఐటీఐ కళాశాల ఆధునికీకరణకు సుమారు రూ.40 కోట్లు, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ ఏర్పాటుకు మరో రూ.40 కోట్లు కేటాయించే దిశగా చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిరణ్మయి, ఆర్డీఓ సరిత, తహశీల్దార్ నాగయ్య, పాలిటెక్నిక్ విద్యాశాఖ ఆర్జేడీ, కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, వివిధ శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, విద్యార్థినీ విద్యార్థులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు..

బూర్గులలో తొలి తెలంగాణ పబ్లిక్ స్కూల్‌కు శంకుస్థాపన





రూ.10 కోట్లతో అంతర్జాతీయ ప్రమాణాలతో పాఠశాల నిర్మాణం

కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ విద్యను తీర్చిదిద్దడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం: మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

రంగారెడ్డి జిల్లా, నవంబర్ 27 (నేటి వెలుగు):

పేద, మధ్యతరగతి విద్యార్థులకు ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా నాణ్యమైన విద్యను అందించడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, వాణిజ్య, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి, రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు.శుక్రవారం రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గం ఫరూఖ్‌నగర్ మండలం బూర్గుల గ్రామంలో రూ.10 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న తెలంగాణ పబ్లిక్ స్కూల్ నూతన భవన నిర్మాణ పనులకు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకరయ్యతో కలిసి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ తొలి ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు జన్మించిన గ్రామం కావడంతో ఆయన స్మృతికి నివాళిగా రాష్ట్రంలోనే తొలి తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను బూర్గులలో ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ తరహాలో అంతర్జాతీయ ప్రమాణాలతో ఈ పాఠశాలను అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేసేందుకు మెగా డీఎస్సీ ద్వారా ఇప్పటికే 10 వేల మంది ఉపాధ్యాయులను నియమించామని, ఉపాధ్యాయుల బదిలీలను పారదర్శకంగా నిర్వహించామని మంత్రి తెలిపారు. గత పదేళ్లలో నిర్లక్ష్యానికి గురైన వ్యవస్థలను ప్రక్షాళన చేస్తూ విద్య, వైద్యం, సంక్షేమం, అభివృద్ధి రంగాలకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు.మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రేషన్ కార్డుదారులకు సన్నబియ్యం పంపిణీ, కొత్త రేషన్ కార్డుల జారీ, సామాజిక భద్రతా పింఛన్ల వంటి సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని తెలిపారు. సంక్షేమం, అభివృద్ధి ప్రభుత్వానికి రెండు కళ్ల వంటివని స్పష్టం చేశారు.విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ కనబరిచి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, బూర్గుల గ్రామానికి, తెలంగాణ రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని మంత్రి పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకరయ్య, అదనపు కలెక్టర్ కిరణ్మయి, ఆర్డీఓ సరిత, తహసీల్దార్ నాగయ్య, సంబంధిత శాఖల అధికారులు, విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ కాంగ్రెస్ నూతన ఏఐసీసీ ఇన్‌చార్జ్‌తో ఎమ్మెల్యే బాలు నాయక్ భేటీ

ప్రజా ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంపై చర్చ

దేవరకొండ నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి ప్రత్యేక కార్యాచరణ

దేవరకొండ రూరల్, నవంబర్ 27 (నేటి వెలుగు):

తెలంగాణ కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల నూతన ఏఐసీసీ ఇన్‌చార్జ్ బి.ఎం. సందీప్ కుమార్‌ను దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ శుక్రవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ భేటీలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ నాయకత్వంలో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడం, ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడంపై చర్చించారు.ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీలు, మహిళా సంక్షేమ పథకాలు, రైతు సంక్షేమ కార్యక్రమాలు, ఇందిరమ్మ ఇళ్లు, ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం తదితర పథకాల ద్వారా ప్రజలకు కలుగుతున్న ప్రయోజనాలను వివరించారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరవేసేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరాన్ని ఈ సందర్భంగా చర్చించారు.అదేవిధంగా దేవరకొండ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ సంస్థాగత బలోపేతం, గ్రామస్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి వరకు పార్టీ శ్రేణుల సమన్వయం, అభివృద్ధి కార్యక్రమాల ప్రచారం, కార్యకర్తలకు తగిన ప్రాధాన్యత కల్పించడం వంటి అంశాలపై ఇరువురు చర్చించారు. కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం ఆశయాలకు అనుగుణంగా నాయకులు, కార్యకర్తలను కలుపుకొని ముందుకు సాగుతామని, ప్రజా ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ దేవరకొండ నియోజకవర్గంలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే బాలు నాయక్ తెలిపారు.



పట్టు వస్త్రాలంకరణ మహోత్సవంలో పాల్గొన్న కొండమల్లేపల్లి సర్పంచ్



దేవరకొండ రూరల్, నవంబర్ 27 (నేటి వెలుగు):

కొండమల్లేపల్లి పట్టణానికి చెందిన ఇరుగదిండ్ల సతీష్--రాజేశ్వరి దంపతుల కుమార్తె నవ్యశ్రీ, కుమారుడు భవ్యాంశ్ నూతన పట్టు వస్త్రాలంకరణ మహోత్సవం కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు.ఈ శుభకార్యానికి కొండమల్లేపల్లి సర్పంచ్ పసునూరి యుగేందర్ రెడ్డి హాజరై చిన్నారులను ఆశీర్వదించారు. వారు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాసర్ల వెంకటేశ్వర్లు, తిరుపతయ్య, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, తదితరులు పాల్గొన్నారు.

గ్రీన్ వాటర్ వినియోగాన్ని మరింత పెంచాలి

గృహేతర అవసరాలకు శుద్ధి చేసిన మురుగునీటినే వినియోగించేలా ప్రోత్సహించాలి

ప్రభుత్వ శాఖల్లో గ్రీన్ వాటర్ వినియోగంపై ప్రత్యేక పర్యవేక్షణ

జలమండలి జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ మయాంక్ మిట్టల్ ఆదేశాలు





హైదరాబాద్, నవంబర్ 27 (నేటి వెలుగు):

ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో భవిష్యత్తులో తాగునీటి కొరత తలెత్తకుండా నీటి వనరులను సంరక్షించేందుకు గ్రీన్ వాటర్ (శుద్ధి చేసిన మురుగునీరు) వినియోగాన్ని మరింత పెంచాలని జలమండలి జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ మయాంక్ మిట్టల్ అధికారులను ఆదేశించారు. గృహేతర అవసరాలకు తాగునీటికి బదులుగా శుద్ధి చేసిన మురుగునీటిని వినియోగించేలా విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు.శుక్రవారం జలమండలి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు, ఆపరేషన్స్ డైరెక్టర్లు, చీఫ్ జనరల్ మేనేజర్లు, జనరల్ మేనేజర్లతో గ్రీన్ వాటర్ సరఫరా, వినియోగం, నీటి కాలుష్య నివారణ చర్యలపై ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు.

గ్రీన్ వాటర్ వినియోగంపై ప్రత్యేక దృష్టి

ఈ సందర్భంగా జేఎండీ మాట్లాడుతూ ప్రభుత్వంలోని అన్ని శాఖల్లో గ్రీన్ వాటర్ వినియోగిస్తున్న తీరును జనరల్ మేనేజర్లు వ్యక్తిగతంగా పర్యవేక్షించాలని ఆదేశించారు. తమ పరిధిలోని నిర్మాణ సంస్థలు, బిల్డర్లు, భారీ గేటెడ్ కమ్యూనిటీల ప్రతినిధులను సంప్రదించి గ్రీన్ వాటర్ వినియోగాన్ని ప్రోత్సహించాలని సూచించారు.ఎల్‌నినో ప్రభావంతో భవిష్యత్తులో నీటి కొరత ఏర్పడే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని తాగునీటి వనరులను జాగ్రత్తగా వినియోగించుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

కలుషిత నీటి ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం వద్దు

నీటి కాలుష్యాన్ని గుర్తించేందుకు అందుబాటులో ఉన్న పొల్యూషన్ ఐడెంటిఫికేషన్ మెషీన్ల వినియోగంపై కూడా జేఎండీ సమీక్షించారు. ఈ యంత్రాలను సమర్థవంతంగా వినియోగిస్తూ పెండింగ్‌లో ఉన్న నీటి కాలుష్య ఫిర్యాదులన్నింటినీ తక్షణమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో రీజియన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు పంకజ, సామ్రాట్ అశోక్, సంతోష్, ఆపరేషన్స్ డైరెక్టర్లు నారాయణ, ప్రభు, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సండే ఆన్ సైకిల్ పోస్టర్‌ను ఆవిష్కరించిన అడిషనల్ ఎస్పీ రమేష్

నల్గొండ నవంబర్ 27 (నేటి వెలుగు)



భారత ప్రభుత్వం యువజన వ్యవహారాలు మరియు క్రీడల మంత్రిత్వ శాఖ మైభారత్ నల్లగొండ జిల్లా వారి ఆధ్వర్యంలో స్థానిక ఎన్జీ కళాశాల మైదానం లో ఈ నెల 29 ఆదివారం నాడు నిర్వహించబోయే సండే ఆన్ సైకిల్ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను నల్లగొండ జిల్లా అడిషనల్ ఎస్పీ రమేష్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ రమేష్ మాట్లాడుతూ, నేటి జీవనశైలిలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, సైక్లింగ్ వంటి వ్యాయామాలను తమ దైనందిన జీవితంలో భాగంగా చేసుకోవాలని సూచించారు. సైక్లింగ్ వల్ల శారీరక ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించవచ్చని తెలిపారు. యువత పెద్ద సంఖ్యలో ఇలాంటి ఆరోగ్యకరమైన కార్యక్రమాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా యువజన మరియు క్రీడల అధికారి మహమ్మద్ అక్బర్ అలీ, మై భారత్ ప్రతినిధి కొండ నాయక్, మై భారత్ యూత్ వాలంటీర్ బాబురావు, హనుమంతు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేటి వెలుగు
నేటి సమాజం... నేటి వెలుగు...
తెలుగు దినపత్రిక
పి. నవీన్ కుమార్ గౌడ్

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 300 శాతం పెరిగిన ప్రసవాలు





వైద్య సేవల మెరుగుదలకు కలెక్టర్ ప్రత్యేక చర్యలు

11 పీహెచ్‌సీల్లో కాన్పు గదుల ఆధునికీకరణకు నిధులు

వైద్యాధికారులు, సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేత

సూర్యాపేట, నవంబర్ 27 (నేటి వెలుగు):

జిల్లాలో ప్రభుత్వ వైద్య సేవలను మరింత బలోపేతం చేస్తూ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ తేజస్ నంద్‌లాల్ పవార్ తెలిపారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాలన్నీ నిర్దేశిత లక్ష్యాలను సాధించాలని, వైద్యాధికారులు, సిబ్బంది సమయపాలన పాటిస్తూ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని సూచించారు.గురువారం (26-11-2026) ఐడీఓసీ సమావేశ మందిరంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కె. కోటిరత్నం ఆధ్వర్యంలో జిల్లాలోని ప్రోగ్రాం అధికారులు, వైద్యాధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు నిధులు మంజూరు చేస్తామని తెలిపారు. ప్రతి పీహెచ్‌సీ వారీగా అవసరమైన వైద్య పరికరాలు, భవన మరమ్మతులు, ఇతర సివిల్ పనులకు సంబంధించిన సమగ్ర నివేదికలను సమర్పించాలని అధికారులను ఆదేశించారు.

పీహెచ్‌సీల్లో 300 శాతం పెరిగిన ప్రసవాలు

జిల్లాలోని 11 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రసవ గదుల ఆధునికీకరణ కోసం ఒక్కో పీహెచ్‌సీకి రూ.3 లక్షల చొప్పున నిధులు మంజూరు చేసి అవసరమైన సదుపాయాలు కల్పించినట్లు అధికారులు తెలిపారు. ఈ చర్యల ఫలితంగా ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రసవాల సంఖ్య గత ఏడాదితో పోలిస్తే సుమారు 300 శాతం పెరిగిందని వెల్లడించారు.ఈ ఏడాది ఇప్పటివరకు పీహెచ్‌సీల్లో 236 సుఖ ప్రసవాలు జరిగాయని, నెలకు సగటున 25 ప్రసవాలు నమోదవుతున్నాయని వివరించారు. గత ఏడాది నెలకు 7 నుంచి 8 ప్రసవాలు మాత్రమే జరిగాయని, ఏడాది మొత్తం 86 ప్రసవాలు నమోదయ్యాయని తెలిపారు.

వైద్య సిబ్బందికి కలెక్టర్ అభినందనలు

ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెరగడానికి వైద్యాధికారులు, ప్రోగ్రాం అధికారులు, నర్సింగ్ సిబ్బంది సమన్వయంతో చేసిన కృషి కారణమని కలెక్టర్ అభినందించారు. ఈ సందర్భంగా సంబంధిత పీహెచ్‌సీల వైద్యాధికారులకు ప్రశంసాపత్రాలు అందజేశారు.కలెక్టర్ అందిస్తున్న సహకారం, అవసరమైన నిధులు, మౌలిక సదుపాయాల కల్పన, నిరంతర మార్గనిర్దేశం వల్లే ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కె. కోటిరత్నం, ఇతర వైద్యాధికారులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓలు డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ మాధవ్ కుమార్, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ నాజియా, డాక్టర్ శ్రీశైలం, డాక్టర్ నాగరాజు, డిప్యూటీ డెమో వి. సంజీవరెడ్డి, డీపీఓ ఉమా, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయ అధికారులు, సిబ్బంది, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల విద్యా సామర్థ్యాల పెంపుపై ప్రత్యేక దృష్టి పెట్టాలి





పాఠశాలల్లో ప్రతిరోజూ గంటపాటు రెమిడియల్ తరగతులు నిర్వహించాలి

జిల్లా విద్యాశాఖ సమీక్షలో కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ ఆదేశాలు

సూర్యాపేట, నవంబర్ 27 (నేటి వెలుగు):

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల విద్యా సామర్థ్యాలను మెరుగుపరిచేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా తెలుగు, గణితం, ఆంగ్లం సబ్జెక్టుల్లో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు.శుక్రవారం జిల్లా కలెక్టరేట్‌లో మండల విద్యాధికారులు (ఎంఈఓలు), కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులతో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ పలు అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు.విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పెంపొందించేందుకు ప్రతి పాఠశాలలో ప్రతిరోజూ గంటపాటు రెమిడియల్ తరగతులు నిర్వహించాలని సూచించారు. ఈ నెలలో 10 ఎఫ్ఎల్ఎన్ కాంపిటెంట్ పాఠశాలలను సందర్శించకపోవడంపై అధికారులను వివరణ కోరారు. వెంటనే పాఠశాలల సందర్శనలు పూర్తి చేయాలని ఆదేశించారు. పాఠశాలల సందర్శనల్లో మంచి పనితీరు కనబరిచిన కందిబండ ప్రాథమిక పాఠశాలను ఈ సందర్భంగా అభినందించారు.ఎస్ఎస్సీ సమ్మేటివ్-1 ఫలితాల్లో అన్ని సబ్జెక్టులతో పాటు గణితంలోనూ వెనుకబడిన 31 పాఠశాలలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. విద్యార్థుల అభ్యసన స్థాయిని పెంచేందుకు ఆయా సబ్జెక్టుల నిపుణుల సేవలను వినియోగించుకోవాలని ఎంఈఓలు, కాంప్లెక్స్ హెచ్ఎంలకు సూచించారు.ప్రతిరోజూ ఎఫ్ఆర్ఎస్ హాజరును పర్యవేక్షిస్తూ 90 శాతానికి పైగా హాజరు నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రీప్రైమరీలో విద్యార్థుల నమోదు పెంచడంతో పాటు ప్రత్యేక అవసరాలున్న పిల్లలకు సంబంధించిన భవన నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. విద్యార్థుల అపార్ ఐడీ జనరేషన్ ప్రక్రియను కూడా వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు.పీఎం శ్రీ, సమగ్ర శిక్ష నిధులతో పాటు పీఎం పోషణ బడ్జెట్‌ను నిబంధనల ప్రకారం సక్రమంగా వినియోగించాలని కలెక్టర్ సూచించారు. ఖాన్ అకాడమీ, ఫిజిక్స్ వాలా, ఏఎక్స్ఎల్ ల్యాబ్స్ పనితీరును మెరుగుపరిచి విద్యార్థులకు మెరుగైన అభ్యసన అవకాశాలు కల్పించాలని తెలిపారు.పాఠశాలల్లో డ్రగ్ ఫ్రీ వాతావరణాన్ని ఏర్పాటు చేసేందుకు ఉపాధ్యాయులు, అధికారులు సమన్వయంతో కృషి చేయాలని సూచించారు. మధ్యాహ్న భోజన పథకం (ఎండీఎం) డాష్‌బోర్డును ప్రతి వారం తప్పనిసరిగా పర్యవేక్షించాలని ఆదేశించారు. స్పర్శ్ బిల్లుల ఆమోదంలో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించేందుకు డీటీఓను సమావేశానికి పిలిపించి సంబంధిత సమస్యలపై చర్చించి పరిష్కరించారు.ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ కోఆర్డినేటర్లు వై. రాంబాబు, శ్రవణ్, ఈ. హరికృష్ణ, టీ. పూలన్, సూర్యనారాయణ, సూపరింటెండెంట్ మోహన్, ఎఫ్ఎల్ఎన్ సెల్ సభ్యులు, ఎంఈఓలు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, డీఈఓ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

టీబీ రోగులకు పోషకాహార సహాయం కోసం రూ.2.22 కోట్ల సిఎస్ఆర్ నిధులు మంజూరు చేసిన హెచ్ బిఎల్ ఇంజనీరింగ్ లిమిటెడ్



మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా

జాతీయ ప్రాధాన్యతలకు అనుగుణంగా కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు తమ కార్పొరేట్ సామాజిక బాధ్యత (సిఎస్ఆర్) నిధులను వినియోగించడంలో భాగంగా, టీబీ ముక్త్ భారత్ అభియాన్ (టీబీఎంబీఏ) ద్వారా నిక్షయ్ మిత్ర కార్యక్రమాన్ని ప్రోత్సహిస్తున్నాయి. దేశంలో క్షయవ్యాధి నిర్మూలనను వేగవంతం చేయాలనే లక్ష్యంతో కార్పొరేట్ సంస్థలు నిక్షయ్ మిత్రలుగా ముందుకు వచ్చి టీబీ రోగులకు పోషకాహారంతో పాటు ఇతర రోగి-కేంద్రిత సహాయాన్ని అందిస్తున్నాయి.ఈ నేపథ్యంలో, మేడ్చల్--మల్కాజిగిరి జిల్లాలో ప్రధానమంత్రి టీబీ ముక్త్ భారత్ అభియాన్ (పి ఎం టి బి ఎం ఏ) కింద చికిత్స పొందుతున్న అర్హులైన టీబీ రోగులకు పోషకాహార సహాయం అందించేందుకు హెచ్ బిఎల్ ఇంజనీరింగ్ లిమిటెడ్ సంస్థ తన కార్పొరేట్ సామాజిక బాధ్యత (సిఎస్ఆర్) నిధుల నుంచి మొత్తం రూ.2,22,00,000/- (రెండు కోట్ల ఇరవై రెండు లక్షల రూపాయలు) అందించేందుకు ఆమోదం తెలిపింది.ఈ మేరకు సంస్థ సిఎస్ఆర్ విభాగానికి చెందిన శ్రీ సూరపనేని హనుష్, కార్పొరేట్ ఫైనాన్స్ విభాగానికి చెందిన శ్రీ ఎన్. రామకృష్ణ రావు, ఈ రోజు జిల్లా కలెక్టర్ మరియు జిల్లా మేజిస్ట్రేట్ శ్రీ మను చౌదరి, ఐఏఎస్ ని కలిసి సిఎస్ఆర్ నిధులకు సంబంధించిన చెక్కును అందజేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్రీ మను చౌదరి హెచ్ బిఎల్ ఇంజనీరింగ్ లిమిటెడ్ సంస్థ ప్రతినిధులను అభినందించారు. టీబీ రోగులకు వైద్య చికిత్సతో పాటు పోషకాహార సహాయం అందించడం వల్ల వారి ఆరోగ్య పరిస్థితి మెరుగుపడటమే కాకుండా, చికిత్సను క్రమం తప్పకుండా కొనసాగించి పూర్తిచేసేందుకు ప్రోత్సాహం లభిస్తుందని పేర్కొన్నారు.ఈ సిఎస్ఆర్ నిధులతో టీబీ రోగులకు అందించే పోషకాహార బాస్కెట్లలో ధాన్యాలు, చిరుధాన్యాలు (మిల్లెట్స్), ఫోర్టిఫైడ్ రైస్, పప్పులు, వంట నూనె, ప్రోటీన్ వనరులు, పాలపొడి, వేరుశెనగలు తదితర పోషక విలువలు అధికంగా ఉండే ఆహార పదార్థాలను లబ్ధిదారుల అవసరాలకు అనుగుణంగా అందించనున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. కె. ఆనంద్ తెలిపారు.ఈ సహాయం ద్వారా టీబీ రోగుల పోషక స్థితి, రోగనిరోధక శక్తి మెరుగుపడటంతో పాటు వారు చికిత్సను క్రమం తప్పకుండా కొనసాగించి పూర్తిచేసేందుకు దోహదపడుతుందని తెలిపారు. అంతేకాకుండా ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలపై పోషకాహార ఖర్చుల భారం తగ్గడంతో పాటు, కేంద్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక లక్ష్యమైన 'టీబీ ముక్త్ భారత్' సాధనకు ఈ కార్యక్రమం ఎంతగానో తోడ్పడుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఆఫీసర్, ఎన్టిఈపి డా. శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

తెలుగు రాష్ట్రాల అయ్యప్ప భక్తులకు అలర్ట్..

కొల్లాంకు ప్రత్యేక రైళ్లు, రేపటి నుంచే రిజర్వేషన్లు

శబరిమల భక్తుల కోసం కొల్లాంకు ప్రత్యేక రైళ్లు

హైదరాబాద్, సిర్పూర్ కాగజ్‌నగర్ నుంచి ప్రత్యేక సర్వీసులు

తెలుగు రాష్ట్రాల మీదుగా రాకపోకలు

శనివారం ఉదయం 8 గంటల నుంచి ముందస్తు రిజర్వేషన్లు

మండలం, మకరవిళక్కు సీజన్ దృష్ట్యా రైల్వే శాఖ నిర్ణయం

శబరిమల అయ్యప్ప భక్తులకు భారతీయ రైల్వే శుభవార్త తెలిపింది. మండల-మకరవిళక్కు యాత్ర సీజన్ రద్దీని దృష్టిలో ఉంచుకుని తెలుగు రాష్ట్రాల నుంచి కేరళకు నడపనున్న ప్రత్యేక రైళ్ల ముందస్తు రిజర్వేషన్లు రేపు (శనివారం) ప్రారంభం కానున్నాయి. రేపు ఉదయం 8:00 గంటల నుంచి ప్రయాణికులు ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్, రైల్వే కౌంటర్ల ద్వారా టికెట్లు బుక్ చేసుకోవచ్చని అధికారులు వెల్లడించారు. సిర్పూర్ కాగజ్‌నగర్, హైదరాబాద్‌ల నుంచి కొల్లాం వరకు ఈ వీక్లీ స్పెషల్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు రాకపోకలు సాగిస్తాయి.

హైదరాబాద్ -- కొల్లాం ప్రత్యేక రైలు

హైదరాబాద్ - కొల్లాం ప్రత్యేక రైలు (07187) డిసెంబర్ 4, 18 తేదీల్లో (శుక్రవారాలు) ఉదయం 9:00 గంటలకు హైదరాబాద్‌లో బయలుదేరి మరుసటి రోజు సాయంత్రం 4:55 గంటలకు కొల్లాం చేరుకుంటుంది.

తిరుగు ప్రయాణంలో (07688) డిసెంబర్ 5, 19 తేదీల్లో రాత్రి 7:30 గంటలకు కొల్లాంలో బయలుదేరి, మరుసటి రోజు ఉదయం 7:00 గంటలకు కాజీపేట చేరుకుని ప్రయాణాన్ని ముగిస్తుంది. ఈ రైలు లింగంపల్లి, వికారాబాద్, తాండూర్, రాయచూర్, మంత్రాలయం రోడ్, గుంతకల్, అనంతపురం, ధర్మవరం, కదిరి, మదనపల్లె, పీలేరు, చిత్తూరు మీదుగా ప్రయాణిస్తుంది.

సిర్పూర్ కాగజ్‌నగర్ -- కొల్లాం ప్రత్యేక రైలు

సిర్పూర్ కాగజ్‌నగర్ - కొల్లాం రైలు (07171) డిసెంబర్ 11, 25 తేదీల్లో తెల్లవారుజామున 4:00 గంటలకు బయలుదేరి మరుసటి రోజు సాయంత్రం 4:55 గంటలకు కొల్లాం చేరుకుంటుంది. ఈ సర్వీస్ బెల్లంపల్లి, మంచిర్యాల, రామగుండం, పెద్దపల్లి, కాజీపేట, సికింద్రాబాద్, ఏపీలోని పలు ప్రాంతాల మీదుగా నడుస్తుంది.తిరుగు ప్రయాణంలో (07172) డిసెంబర్ 12, 26 తేదీల్లో రాత్రి 7:30 గంటలకు కొల్లాంలో బయలుదేరి, మరుసటి తెల్లవారుజామున 4:00 గంటలకు హైదరాబాద్ చేరుకుంటుం. ఈ సర్వీస్ తిరుగు ప్రయాణంలో సిర్పూర్ కాగజ్‌నగర్ వరకు వెళ్లకుండా హైదరాబాద్‌లోనే ముగుస్తుంది. డిసెంబర్ 27 వరకు మండల పూజలు, అనంతరం జనవరి మధ్య వరకు మకరవిళక్కు యాత్ర కొనసాగనున్నందున భక్తులు రేపు ఉదయం 8:00 గంటలకు ప్రారంభమయ్యే రిజర్వేషన్ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు.



రెండో టెస్టులో భారత బౌలర్ల రివర్స్ ఎటాక్.. చివర్లో న్యూజిలాండ్ ప్రతిఘటన, డే 1 హైలైట్స్



తొలి రోజు ఆట ముగిసేసరికి కివీస్ స్కోరు 246/5

110/4 నుంచి జట్టును ఆదుకున్న బ్లండెల్, ఫిలిప్స్ ద్వయం

50వ టెస్టులో టామ్ బ్లండెల్ అజేయ అర్ధసెంచరీ

అరంగేట్రం మ్యాచ్‌లోనే కాన్వే వికెట్ తీసిన గుర్నూర్

రెండు కీలక వికెట్లతో రాణించిన పేసర్ ఆకాశ్ దీప్

భారత్, న్యూజిలాండ్ జట్ల మధ్య క్రైస్ట్‌చర్చ్‌లోని హ్యాగ్లీ ఓవల్ వేదికగా ప్రారంభమైన రెండో టెస్టు తొలి రోజు ఆట రసవత్తరంగా సాగింది. టాస్ గెలిచిన భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ఫీల్డింగ్ ఎంచుకోగా, తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన కివీస్ జట్టు మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 5 వికెట్ల నష్టానికి 246 పరుగులు చేసింది.తొలి సెషన్‌లో న్యూజిలాండ్ ఓపెనర్లు భారత పేసర్లను సమర్థంగా ఎదుర్కొన్నారు. టామ్ లాథమ్, డెవాన్ కాన్వే కలిసి మొదటి వికెట్‌కు 77 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. లంచ్ బ్రేక్‌కు సరిగ్గా చివరి బంతికి అరంగేట్ర బౌలర్ గుర్నూర్ బ్రార్ కాన్వే (31)ని ఎల్బీడబ్ల్యూగా ఔట్ చేసి తన తొలి టెస్టు వికెట్‌ను ఖాతాలో వేసుకున్నాడు.రెండో సెషన్‌లో భారత బౌలర్లు తీవ్రంగా విజృంభించారు. ఆకాశ్ దీప్ వరుసగా దెబ్బతీస్తూ అర్ధసెంచరీ చేసిన కెప్టెన్ లాథమ్ (59)ను పెవిలియన్ చేర్చాడు. ఆ వెంటనే అన్షుల్ కాంబోజ్ హెన్రీ నికోల్స్ (16)ను ఔట్ చేయగా, రచిన్ రవీంద్ర (0)ను ఆకాశ్ దీప్ డకౌట్ చేశాడు. దీంతో కివీస్ స్కోరు బోర్డుపై పరుగులేమీ చేరకుండానే మూడు వికెట్లు కోల్పోయి 110/4తో తీవ్ర కష్టాల్లో పడింది. ఆ విపత్కర పరిస్థితుల్లో డారిల్ మిచెల్, టామ్ బ్లండెల్ కలిసి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దారు. పట్టుదలగా ఆడుతూ టీ బ్రేక్ వరకు మరో వికెట్ పడకుండా కాపాడారు. మూడో సెషన్‌లో వాషింగ్టన్ సుందర్ బౌలింగ్‌లో మిచెల్ (31) లెగ్ స్లిప్‌లో జురెల్‌కు క్యాచ్ ఇచ్చి అవుటయ్యాడు. అనంతరం క్రీజులోకి వచ్చిన గ్లెన్ ఫిలిప్స్‌తో కలిసి బ్లండెల్ మరో వికెట్ పడకుండా రోజును ముగించాడు. తన 50వ టెస్టు ఆడుతున్న బ్లండెల్ 117 బంతుల్లో విలువైన అర్ధసెంచరీ పూర్తి చేశాడు. వీరిద్దరూ ఆరో వికెట్‌కు అజేయంగా 62 పరుగులు జోడించారు. మొదటి రోజు ఆట ముగిసే సమయానికి బ్లండెల్ 53, ఫిలిప్స్ 36 పరుగులతో క్రీజులో ఉన్నారు. భారత బౌలర్లలో ఆకాశ్ దీప్ 2, గుర్నూర్ బ్రార్, అన్షుల్ కాంబోజ్, వాషింగ్టన్ సుందర్ తలో వికెట్ పడగొట్టారు.

రెండో టెస్ట్: రెండో రోజు భారత్ బౌలర్ల హవా... లంచ్‌కు కివీస్ 330/8

న్యూజిలాండ్‌తో జరుగుతున్న రెండో టెస్టులో భారత బౌలర్లు పట్టు బిగించారు. రెండో రోజు, శనివారం లంచ్ విరామానికి న్యూజిలాండ్ 109 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 330 పరుగులు చేసింది. తొలి సెషన్‌లో భారత బౌలర్లు ఆధిపత్యం ప్రదర్శించి మూడు కీలక వికెట్లు పడగొట్టారు. కివీస్ వికెట్ కీపర్ టామ్ బ్లండెల్ (80 నాటౌట్) ఒంటరి పోరాటం చేస్తున్నాడు.రెండో రోజు ఆటను 246/5 ఓవర్‌నైట్ స్కోరుతో ప్రారంభించిన న్యూజిలాండ్‌కు ఉదయం సెషన్‌లోనే షాక్ తగిలింది. కొత్త బంతితో బౌలింగ్ ప్రారంభించిన అన్షుల్ కాంబోజ్, తన తొలి ఓవర్‌లోనే గ్లెన్ ఫిలిప్స్ (36)ను ఔట్ చేశాడు. ఫిలిప్స్ బ్యాట్ ఎడ్జ్ తీసుకున్న బంతిని వికెట్ కీపర్ రిషబ్ పంత్ సులభంగా అందుకున్నాడు. దీంతో బ్లండెల్‌తో ఆరో వికెట్‌కు నెలకొల్పిన కీలక భాగస్వామ్యానికి తెరపడింది.ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన నాథన్ స్మిత్ (26), బ్లండెల్‌తో కలిసి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దే ప్రయత్నం చేశాడు. దూకుడుగా ఆడిన స్మిత్, కొన్ని బౌండరీలు బాదడంతో స్కోరు బోర్డు ముందుకు కదిలింది. అయితే, ప్రమాదకరంగా మారుతున్న ఈ జోడీని ఆకాశ్ దీప్ విడదీశాడు. స్మిత్ కొట్టిన బంతి నేరుగా బౌలర్ చేతికే చిక్కడంతో కివీస్ ఏడో వికెట్ కోల్పోయింది. మరోవైపు, ఓపికగా ఆడిన బ్లండెల్ తన అర్ధశతకాన్ని పూర్తి చేసుకుని ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. అనంతరం క్రీజులోకి వచ్చిన కైల్ జెమీసన్ (19) కూడా వేగంగా ఆడి కొన్ని బౌండరీలు బాదాడు. అయితే, షార్ట్ బాల్ వ్యూహంతో దాడి చేసిన ఆకాశ్ దీప్, జెమీసన్‌ను డీప్ మిడ్ వికెట్‌లో యశస్వి జైస్వాల్ చేతికి చిక్కేలా చేశాడు. లంచ్ సమయానికి బ్లండెల్ 80 పరుగులు, మాట్ హెన్రీ 5 పరుగులతో క్రీజులో ఉన్నారు. భారత బౌలర్లలో ఆకాశ్ దీప్ 4 వికెట్లు పడగొట్టగా, అన్షుల్ కాంబోజ్ 2 వికెట్లు తీశాడు.



రెండో టెస్టులోనూ సిరాజ్‌ను పక్కన పెట్టడంపై అశ్విన్ సెటైర్లు, తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన కైఫ్

న్యూజిలాండ్‌తో క్రైస్ట్‌చర్చ్ వేదికగా జరుగుతున్న రెండో టెస్టు తుది జట్టులో స్టార్ పేసర్ మహమ్మద్ సిరాజ్‌కు మరోసారి చోటు దక్కకపోవడం క్రికెట్ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. తొలి టెస్టులోనే కాకుండా రెండో మ్యాచ్‌లోనూ సిరాజ్‌ను పక్కన పెట్టడంపై భారత మాజీ ఆల్‌రౌండర్ రవిచంద్రన్ అశ్విన్, మాజీ క్రికెటర్ మహమ్మద్ కైఫ్ బహిరంగంగా అసంతృప్తి వ్యక్తం చేశారు.ఈ అంశంపై అశ్విన్ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' వేదికగా వ్యంగ్యంగా స్పందించాడు. "ఆకాశ్ దీప్ ఈరోజు అద్భుతంగా బౌలింగ్ చేస్తుంటే, సిరాజ్ మాత్రం తన బౌలింగ్ పదును కోల్పోయినట్లు కనిపిస్తున్నాడు. అతడు కష్టపడి ప్రాక్టీస్ చేసి బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ నాటికి పుంజుకుంటాడని ఆశిస్తున్నా" అని అశ్విన్ పరోక్షంగా చురకలంటించారు. అంతేకాకుండా, "60 నుంచి 80 ఓవర్ల సమయం బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉంటుంది, సిరాజ్ గట్టిగా పరిగెత్తి బౌలింగ్ చేసి ఒకటి రెండు వికెట్లు తీస్తే బాగుణ్ణు" అంటూ జట్టు నిర్ణయాన్ని ఎద్దేవా చేశాడు.మరోవైపు మహమ్మద్ కైఫ్ కూడా తీవ్ర అసహనం వ్యక్తం చేశాడు. "భారత ప్రధాన ఫాస్ట్ బౌలర్ అయిన సిరాజ్‌ను మళ్లీ పక్కన పెట్టడం నమ్మశక్యంగా లేదు. విదేశీ టెస్టుల్లో జస్ప్రీత్ బుమ్రాతో పాటు జట్టులో ముందుగా పరిగణించాల్సిన పేర్లలో సిరాజ్ ఒకడు. సిరాజ్ వరల్డ్ క్లాస్ బౌలర్ అని, చక్కగా బౌలింగ్ చేస్తున్నాడని స్వయంగా బౌలింగ్ కోచ్ మోర్నే మోర్కెల్ చెప్పినప్పుడు అతడిని తుది జట్టులోకి ఎందుకు తీసుకోలేదు?" అని కైఫ్ ప్రశ్నించాడు. ప్రస్తుత ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) సైకిల్‌లో 11 మ్యాచ్‌లలో 43 వికెట్లు తీసి అత్యధిక వికెట్లు పడగొట్టిన భారత బౌలర్‌గా ఉన్న సిరాజ్‌కు మొండిచేయి చూపడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



రోహిత్‌కు డిప్యూటీగా ఉండాలన్న ముంబై ఇండియన్స్.. బుమ్రా నో చెప్పాడా?

ఐపీఎల్ 2027 కోసం రోహిత్ శర్మకు తిరిగి కెప్టెన్సీ బాధ్యతలు

వైస్ కెప్టెన్‌గా ఉండాలన్న ముంబై ఆఫర్‌ను తిరస్కరించిన బుమ్రా!

అక్టోబర్ తొలి వారంలోనే బుమ్రాను సంప్రదించిన యాజమాన్యం

పదవిని వద్దనుకోవడానికి గల కారణాలపై స్పష్టత కరవు

2028 మెగా వేలం నేపథ్యంలో బుమ్రా భవిష్యత్‌పై మొదలైన చర్చ



ఐపీఎల్ 2027 సీజన్‌కు సంబంధించి ముంబై ఇండియన్స్ ఫ్రాంచైజీలో ఆసక్తికర పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. రోహిత్ శర్మను తిరిగి కెప్టెన్‌గా నియమించాలని ఫ్రాంచైజీ నిర్ణయించగా, అతనికి డిప్యూటీగా (వైస్ కెప్టెన్‌గా) వ్యవహరించాలంటూ వచ్చిన ఆఫర్‌ను స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా సున్నితంగా తిరస్కరించినట్లు తెలుస్తోంది.ఇండియా టుడే కథనం ప్రకారం... అక్టోబర్ మొదటి వారంలోనే ముంబై ఇండియన్స్ యాజమాన్యం బుమ్రాను సంప్రదించింది. రాబోయే 2027 ఐపీఎల్ సీజన్‌లో రోహిత్ శర్మకు వైస్ కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టాలని కోరింది. అయితే ఈ ప్రతిపాదనను బుమ్రా మర్యాదపూర్వకంగా తిరస్కరించారు. ఆయన ఈ నిర్ణయం తీసుకోవడానికి గల నిర్దిష్ట కారణాలు మాత్రం వెల్లడి కాలేదు.ప్రస్తుతం ముంబై ఇండియన్స్ జట్టుకు శాశ్వత వైస్ కెప్టెన్ ఎవరూ లేరు. గతంలో హార్దిక్ పాండ్యా అందుబాటులో లేని సమయాల్లో బుమ్రా, సూర్యకుమార్ యాదవ్ నాయకత్వ బాధ్యతలను పంచుకున్నారు. అయితే రాబోయే సీజన్ కోసం రోహిత్ చుట్టూనే నాయకత్వ విభాగాన్ని బలోపేతం చేయాలని ఫ్రాంచైజీ భావిస్తోంది. ఈ క్రమంలోనే బుమ్రాకు డిప్యూటీ పదవిని ఆఫర్ చేసినట్లు సమాచారం జట్టులోని ప్రధాన ఆటగాళ్లలో ఒకరైన బుమ్రా వైస్ కెప్టెన్సీని వద్దనుకోవడం ఇప్పుడు క్రికెట్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. భారత జట్టు ప్రధాన పేసర్‌గా ఇప్పటికే ఎంతో అనుభవం ఉన్న బుమ్రా, అదనపు బాధ్యతల కంటే తన బౌలింగ్‌పైనే పూర్తి దృష్టి పెట్టాలని భావిస్తున్నారా? అనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు, ఈ నిర్ణయం 2028 మెగా వేలానికి ముందు ముంబై ఇండియన్స్‌తో బుమ్రా అనుబంధంపై ఎలాంటి ప్రభావం చూపుతుందనే ప్రశ్నలు కూడా తలెత్తుతున్నాయి.

హిట్ మ్యాన్ రిటర్న్స్.. ముంబై ఇండియన్స్ కెప్టెన్ గా మళ్లీ రోహిత్ శర్మ

ముంబై ఇండియన్స్ సారథిగా రోహిత్ శర్మ పునరాగమనం

ఐపీఎల్ 2027 సీజన్‌కు కెప్టెన్‌గా బాధ్యతలు

పంజాబ్ కింగ్స్ జట్టుకు ట్రేడ్ అయిన హార్దిక్ పాండ్యా

గతంలో రోహిత్ సారథ్యంలోనే ఐదు ట్రోఫీలు గెలిచిన ముంబై

ప్రధాన కోచ్ పొలార్డ్‌తో కలిసి వ్యూహరచన చేయనున్న రోహిత్

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2027 సీజన్‌కు సంబంధించి ముంబై ఇండియన్స్ ఫ్రాంచైజీ అత్యంత కీలక నిర్ణయం తీసుకుంది. జట్టుకు గతంలో ఐదు ట్రోఫీలు అందించిన స్టార్ బ్యాటర్ రోహిత్ శర్మను తిరిగి కెప్టెన్‌గా నియమిస్తున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు శుక్రవారం (నవంబర్ 27) సాయంత్రం 5:45 గంటలకు ముంబై ఇండియన్స్ అధికారిక ప్రకటన విడుదల చేసింది. గతంలో 2024 సీజన్‌కు ముందు రోహిత్ శర్మ స్థానంలో హార్దిక్ పాండ్యాకు ముంబై యాజమాన్యం సారథ్య బాధ్యతలు అప్పగించింది. అయితే ఇటీవల జరిగిన పరిణామాల్లో భాగంగా హార్దిక్ పాండ్యా పంజాబ్ కింగ్స్ జట్టుకు వెళ్లగా, పంజాబ్ నుంచి ఎడమచేతి వాటం పేసర్ అర్ష్‌దీప్ సింగ్ ముంబై ఇండియన్స్‌కు ట్రేడ్ అయ్యాడు. హార్దిక్ నిష్క్రమణ అనంతరం సూర్యకుమార్ యాదవ్, జస్‌ప్రీత్ బుమ్రాల పేర్లు కెప్టెన్సీ కోసం పరిశీలనకు వచ్చినప్పటికీ, ఫ్రాంచైజీ చివరకు అత్యంత అనుభవజ్ఞుడైన రోహిత్ శర్మ వైపే మొగ్గు చూపింది.రోహిత్ శర్మ గతంలో 2013 సీజన్ మధ్య నుంచి 2023 వరకు ముంబై ఇండియన్స్‌కు పూర్తిస్థాయి సారథిగా వ్యవహరించాడు. హిట్ మ్యాన్ నాయకత్వంలోనే ముంబై జట్టు 2013, 2015, 2017, 2019, 2020లలో ఐపీఎల్ విజేతగా నిలిచింది. ఐదు ఐపీఎల్ టైటిళ్లు గెలిచిన కెప్టెన్‌గా రోహిత్ రికార్డు సృష్టించాడు. అంతేకాకుండా రోహిత్ కెప్టెన్సీలో ముంబై జట్టు ఫైనల్‌కు చేరిన ప్రతిసారీ ట్రోఫీని ముద్దాడింది.హార్దిక్ పాండ్యా కెప్టెన్సీలో ముంబై జట్టు మూడేళ్లపాటు ఆశించిన రీతిలో రాణించలేకపోయింది. 2024 సీజన్‌లో పాయింట్ల పట్టికలో ఆఖరి స్థానంలో నిలిచిన ముంబై, 2025లో క్వాలిఫైయర్ 2 వరకు వెళ్లింది. ఇక 2026 సీజన్‌లో తొమ్మిదో స్థానంతో సరిపెట్టుకోవడంతో జట్టు ప్లేటిల్ కరవు ఆరేళ్లకు చేరింది.తిరిగి కెప్టెన్సీ బాధ్యతలు చేపట్టడంపై రోహిత్ శర్మ స్పందిస్తూ, "ముంబై ఇండియన్స్ నా జీవితంలో ఎంతో ముఖ్యమైన భాగం. ఈ జట్టును నడిపించడాన్ని ఎప్పుడూ ఎంతో గర్వంగా భావిస్తాను. నా 20వ సీజన్ కోసం పూర్తి ఉత్సాహంతో సిద్ధంగా ఉన్నాను" అని పేర్కొన్నాడు.ప్రస్తుతం 39 ఏళ్ల వయసులో ఉన్న రోహిత్ శర్మను, రాబోయే మెగా వేలానికి ముందస్తు వ్యూహంలో భాగంగా ఈ సైకిల్ చివరి సీజన్‌కు సారథిగా నియమించినట్లు తెలుస్తోంది. జట్టులో ప్రధాన ఓపెనర్‌గా కొనసాగుతూనే, ప్రధాన కోచ్ కీరన్ పొలార్డ్‌తో కలిసి 2027 వేలానికి సంబంధించిన ప్రణాళికలను రోహిత్ సిద్ధం చేయనున్నాడు. జస్‌ప్రీత్ బుమ్రా, అర్ష్‌దీప్ సింగ్ లాంటి పటిష్ఠమైన పేస్ దళం తోడవడంతో, రోహిత్ నాయకత్వంలో ముంబై ఇండియన్స్ తిరిగి పుంజుకుంటుందని అభిమానులు ఆశిస్తున్నారు.



నేటి వెలుగు
నేటి సమాజం... నేటి వెలుగు...
తెలుగు దినపత్రిక
పి. నవీన్ కుమార్ గౌడ్

ఆ సినిమా తర్వాత నాన్న డిప్రెషన్‌లోకి వెళ్లారు..

కోమా దాకా వెళ్లి వచ్చారు: సుధాకర్ తనయుడు బెన్నీ

సుధాకర్ అనారోగ్యంపై ఆసక్తికర విషయాలు పంచుకున్న కుమారుడు మైఖేల్

సంక్రాంతి సినిమా తర్వాత అవకాశాలు తగ్గి డిప్రెషన్‌లోకి వెళ్లిన సుధాకర్

తీవ్రమైన బ్రెయిన్ స్ట్రోక్‌తో నెల రోజుల పాటు కోమాలోనే ఉన్న వైనం

చిరంజీవి, జగపతిబాబు వంటి నటులు ఆ సమయంలో అండగా నిలిచారని వెల్లడి

అడయార్ ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్ జ్ఞాపకాలను గుర్తు చేసుకున్న మైఖేల్ బెన్నీ



టాలీవుడ్ సీనియర్ నటుడు, ఒకప్పటి స్టార్ కమెడియన్ సుధాకర్ ఆరోగ్య పరిస్థితి, ఆయన ఎదుర్కొన్న గడ్డు పరిస్థితుల గురించి కుమారుడు మైఖేల్ బెన్నీ ఇటీవల ఓ ఇంటర్వ్యూలో భావోద్వేగ విషయాలను పంచుకున్నారు. హీరోగా సినీ ప్రస్థానం ప్రారంభించి, ఆ తర్వాత హాస్యనటుడిగా, విలన్‌గా ఎన్నో అద్భుతమైన విజయాలను సొంతం చేసుకున్న సుధాకర్.. కెరీర్ ముగింపు దశలో తీవ్ర అనారోగ్య సమస్యలను ఎదుర్కొన్న సంగతి తెలిసిందే. ఆ సమయంలో ఆయన దాదాపు నెల రోజుల పాటు కోమాలో ఉన్నారని మైఖేల్ తెలిపారు. సుధాకర్ సినీ ప్రస్థానంలో 2003-04లో వచ్చిన 'సంక్రాంతి' సినిమా తర్వాత అవకాశాలు గణనీయంగా తగ్గిపోయాయని అన్నారు. వరుసగా బిజీగా గడిపిన ఆయన, ఒక్కసారిగా అవకాశాలు తగ్గడంతో తీవ్రమైన డిప్రెషన్‌లోకి వెళ్లిపోయారని.. దీనికితోడు అదుపుతప్పిన మధుమేహం (డయాబెటిస్) సమస్య ఆయనను మరింత కుంగదీసిందని చెప్పుకొచ్చారు. ఈ మానసిక, శారీరక ఒత్తిళ్ల కారణంగా సుధాకర్‌కు తీవ్రమైన బ్రెయిన్ హెమరేజ్ (స్ట్రోక్) వచ్చిందని, దీంతో ఆయన పరిస్థితి విషమించి సుమారు నెల రోజుల పాటు కోమాలోనే ఉండిపోయారని వెల్లడించారు. ఆ సమయంలో తాను 10వ తరగతి చదువుతున్నానని, పరిస్థితి తీవ్రత అర్థం కాకుండా కుటుంబ సభ్యులు మొదట్లో ఆ విషయాన్ని తన వద్ద దాచారని మైఖేల్ గుర్తు చేసుకున్నారు.అయితే ఆ క్లిష్ట సమయంలో చిత్ర పరిశ్రమ నుంచి సుధాకర్ కుటుంబానికి విశేషమైన మద్దతు లభించిందని తెలిపారు. ముఖ్యంగా మెగాస్టార్ చిరంజీవి, హీరో జగపతిబాబు వంటి అగ్ర నటులు తరచూ ఆసుపత్రికి, ఇంటికి వచ్చి పరామర్శించారని.. కుటుంబ సభ్యులతో సమయం గడుపుతూ వారికి కొండంత ధైర్యాన్ని అందించారని వివరించారు. అందరి ప్రార్థనలు, సరైన వైద్యంతో తన తండ్రి సుధాకర్ కోమా నుంచి కోలుకుని సాధారణ స్థితికి వచ్చారని వెల్లడించారు.తన తండ్రి కెరీర్ పీక్ స్టేజ్‌ను గుర్తు చేసుకుంటూ.. ఆ రోజుల్లో ఒక కమెడియన్‌గా సుధాకర్ అందుకున్న స్టార్‌డమ్ చాలా అరుదైనదని మైఖేల్ చెప్పారు. తనకు తెలిసినంత వరకు.. అప్పట్లో ఆయనకు అవకాశాలకు గానీ, ఆర్థికంగా గానీ ఎలాంటి లోటూ లేదని పేర్కొన్నారు. చిరంజీవి, సుధాకర్ చెన్నైలోని అడయార్ ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌లో రూమ్‌మేట్స్‌గా ఉన్నప్పటి సంగతులను కూడా ఆయన పంచుకున్నారు. ఆ సమయంలో ఇద్దరూ పనులు పంచుకునేవారని, చిరంజీవి కూరలు వండితే సుధాకర్ అన్నం వండేవారని సరదాగా తెలిపారు. తన తండ్రి నటించిన చిత్రాల్లో 'సీతారామయ్య గారి మనవరాలు', 'పెద్దరికం', 'ఖుషి' సినిమాలు తనకు అత్యంత ఇష్టమైనవని చెప్పారు.ఇక తన కెరీర్ ఆసక్తుల గురించి మాట్లాడుతూ.. దర్శకుడు వివేక్ ఆత్రేయ తెరకెక్కించే విభిన్నమైన శైలి చిత్రాలు తనకు చాలా ఇష్టమని మైఖేల్ తెలిపారు. తనకు రొమాంటిక్ కామెడీ జానర్ అంటే ప్రత్యేక ఆసక్తి ఉందని, ఇప్పటికే ఆ జానర్‌లో రెండు వెబ్ సిరీస్‌లను రూపొందించినట్లు వెల్లడించారు. నటీనటుల్లో నివేదా థామస్, రామ్ పోతినేని నటనను ఎంతగానో అభిమానిస్తానని, పవన్ కల్యాణ్‌కు తాను వీరాభిమానినని మైఖేల్ స్పష్టం చేశారు.

ఏఐని వాడేవాళ్లే మిమ్మల్ని రీప్లేస్ చేస్తారు: రామ్ గోపాల్ వర్మ

'ఏఐ ట్రూత్ బాంబ్' పేరుతో సంచలన పోస్ట్ చేసిన ఆర్‌జీవీ

ఉద్యోగులు రహస్యంగా ఏఐతో పనిచేయించుకుని, తామే చేసినట్టు చూపిస్తున్నారని వ్యాఖ్య

ఏఐ ఉద్యోగాలు తీయడం లేదని, ఉద్యోగులే తమను తాము రీప్లేస్ చేసుకుంటున్నారని విశ్లేషణ

భవిష్యత్తులో ఏఐని వాడేవారే, వాడని వారి ఉద్యోగాలను భర్తీ చేస్తారని స్పష్టీకరణ

కంపెనీలకు ఏఐ వల్ల ఉత్పాదకత, లాభాలు పెరుగుతున్నాయని పేర్కొన్న వర్మ

సంచలన దర్శకుడు రామ్ గోపాల్ వర్మ 'ఏఐ ట్రూత్ బాంబ్' పేరుతో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)పై సంచలన వ్యాఖ్యలు చేశారు. ఏఐని ఉపయోగించే వ్యక్తులు, దానిని ఉపయోగించని వారిని భర్తీ చేస్తారని (రీప్లేస్ చేస్తారని) ఆయన స్పష్టం చేశారు. ఏఐ కారణంగా ఉద్యోగాలు పోతున్నాయన్న ఆందోళనపై తనదైన శైలిలో సుదీర్ఘ విశ్లేషణను సోషల్ మీడియాలో పంచుకున్నారు.ఉద్యోగ రంగంలో ఏఐ ప్రభావంపై తన ఆలోచనలను పంచుకుంటూ.. "చాలా మంది ఉద్యోగులు ఏఐ తమ ఉద్యోగాలను దొంగిలిస్తోందని గట్టిగా అరుస్తున్నారు, కానీ నిజానికి వారే తమను తాము 'దొంగిలించుకుంటున్నారు'" అని వర్మ వ్యాఖ్యానించారు. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ కోడ్ రాయడానికి, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ ఐడియాల కోసం, అనలిస్ట్ డేటా విశ్లేషణకు చాట్‌జీపీటీ, క్లాడ్, మిడ్‌జర్నీ వంటి ఏఐ టూల్స్‌ను రహస్యంగా వాడుతున్నారని ఆయన వివరించారు. తాము కష్టపడి చేసినట్టుగా ఆ పనిని పైఅధికారుల ముందు ప్రెజెంట్ చేస్తున్నారని పేర్కొన్నారు."ప్రతి ఒక్కరూ దీన్ని రహస్యంగా చేస్తున్నారు, కానీ ఎవరూ ఒప్పుకోవడం లేదు. అయితే, కంపెనీలకు ఈ విషయం గణాంకాల రూపంలో తెలిసిపోతుంది" అని వర్మ అన్నారు. ఏఐ వాడకం వల్ల కంపెనీల అవుట్‌పుట్ పెరిగిందని, నాణ్యత మెరుగుపడిందని, లాభాలు పెరిగాయని తెలిపారు. "ఎందుకంటే ఏఐ 24/7 పనిచేస్తుంది, కాఫీ బ్రేక్‌లు తీసుకోదు, అనారోగ్యానికి గురవదు, సహోద్యోగుల గురించి ఫిర్యాదు చేయదు, జీతం అడగదు. అది కేవలం పని చేసి పెడుతుంది" అని ఆయన అన్నారు.ఇలాంటి పరిస్థితుల్లో ఉద్యోగాల కోత వచ్చినప్పుడు, ఉద్యోగులు షాక్‌కి గురవుతారని, కంపెనీని, టెక్నాలజీని నిందిస్తారని వర్మ అభిప్రాయపడ్డారు. "కానీ వాస్తవానికి, ఏఐ వచ్చి ఎవరినీ బయటకు గెంటలేదు. ఉద్యోగులు రహస్యంగా తమను తాము ఎప్పుడో రీప్లేస్ చేసుకున్నారు. తాము చేయని పనికి జీతం తీసుకుంటూ కూర్చున్నారు" అని తన పోస్టులో ఘాటుగా పేర్కొన్నారు.భవిష్యత్తులో ఏఐ వాడకాన్ని రహస్యంగా ఉంచడం కాదని, దాన్ని బాహాటంగా, దూకుడుగా, ఎలాంటి అపరాధ భావన లేకుండా ఉపయోగించడమే అసలైన నైపుణ్యం అవుతుందని ఆయన తెలిపారు. "భవిష్యత్తు ఎలా ఉన్నా, ఒక కఠినమైన వాస్తవం ఏమిటంటే... ఏఐని ఉపయోగించే వ్యక్తులు, దానిని ఉపయోగించని వారి స్థానాన్ని భర్తీ చేస్తారు" అని వర్మ తన పోస్ట్‌ను ముగించారు.



ప్రభుదేవా 'మూన్‌వాక్' ట్రైలర్ విడుదల.. యాంగ్రీ డైరెక్టర్ పాత్రలో ఏఆర్ రెహమాన్.. 16 పాత్రల్లో యోగిబాబు!

ప్రభుదేవా కథానాయకుడిగా రూపొందిన కామెడీ చిత్రం మూన్‌వాక్ ట్రైలర్ విడుదల

కోపిష్టి దర్శకుడి పాత్రలో కనిపించి సర్‌ప్రైజ్ చేసిన ఏఆర్ రెహమాన్

దాదాపు మూడు దశాబ్దాల తర్వాత రియూనియన్ అయిన ప్రభుదేవా రెహమాన్ ద్వయం

చిత్రంలో అత్తామామలతో సహా 16 విభిన్న గెటప్పుల్లో నటించిన యోగిబాబు

క్రిస్మస్ పండుగ సందర్భంగా డిసెంబర్ 24న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రాక



ఇండియన్ మైఖేల్ జాక్సన్ ప్రభుదేవా ప్రధాన పాత్రలో దర్శకుడు మనోజ్ ఎన్ఎస్ తెరకెక్కించిన తాజా కామెడీ ఎంటర్‌టైనర్ చిత్రం 'మూన్‌వాక్'. శుక్రవారం ఈ చిత్ర అధికారిక ట్రైలర్‌ను మేకర్స్ విడుదల చేశారు. వినోదం, సంగీతం, డ్యాన్స్ ప్రధాన అంశాలుగా రూపొందిన ఈ ట్రైలర్ సినీ ప్రియులను ఎంతగానో ఆకట్టుకుంటోంది. ఆస్కార్ అవార్డు గ్రహీత, ప్రముఖ సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్ ఈ చిత్రంలో నటుడిగా కనిపించడం సినిమాపై ఆసక్తిని మరింత పెంచింది.ఈ సినిమాలో ప్రభుదేవా 'బబూటీ' అనే వినూత్నమైన పాత్రను పోషించారు. కథలో భాగంగా ఆయన జీవితంలో నగ్మా, స్మిత అనే ఇద్దరు మహిళలు, ఒక స్నేహితుడు, విచిత్ర ప్రవర్తన కలిగిన మామగారు ఉంటారని ట్రైలర్ ద్వారా చూపించారు. సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్ ఈ చిత్రంలో కోపిష్టి ఫిల్మ్ డైరెక్టర్ పాత్రలో అతిథిగా మెరిసి అందరినీ ఆశ్చర్యపరిచారు. ప్రముఖ హాస్యనటుడు యోగిబాబు ఈ చిత్రంలో అత్త, మామ పాత్రలతో పాటు ఏకంగా 16 విభిన్న గెటప్పుల్లో కనిపించి అలరించనున్నారు. అంతేకాకుండా ప్రభుదేవా మార్క్ స్టైలిష్ డ్యాన్స్ మూమెంట్స్ కూడా ట్రైలర్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ట్రైలర్‌ను సామాజిక మాధ్యమాల్లో పంచుకుంటూ ప్రభుదేవా స్పందించారు. "సుమారు 30 సంవత్సరాల తర్వాత నేనూ, ఏఆర్ రెహమాన్ పూర్తి స్థాయి వినోదాత్మక చిత్రం కోసం మళ్లీ కలిశాం. 'మూన్‌వాక్' అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించే ఒక కంప్లీట్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్. సెలవుల్లో కుటుంబ సమేతంగా చూసి ఆనందించదగ్గ సినిమా" అని ఆయన పేర్కొన్నారు.బిహైండ్‌వుడ్స్ ప్రొడక్షన్స్ పతాకంపై మనోజ్ ఎన్ఎస్, దివ్య మనోజ్, ప్రవీణ్ ఎలక్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ చిత్రంలో అజు వర్గీస్, అర్జున్ అశోకన్, సాట్జ్, నిష్మా, సుస్మిత, రెడిన్ కింగ్స్లీ, మొట్టై రాజేంద్రన్, లొల్లు సభ స్వామినాథన్, డాక్టర్ సంతోష్ జాకబ్, దీప శంకర్, రామ్‌కుమార్ నటరాజన్ ఇతర ముఖ్య పాత్రలు పోషించారు. చిత్రానికి ఏఆర్ రెహమాన్ సంగీతం సమకూర్చగా, అనూప్ వి. శైలజ సినిమాటోగ్రఫీ అందించారు. శేఖర్ విజే, పీయూష్ షాజియా కొరియోగ్రఫీ బాధ్యతలు నిర్వహించారు. వాస్తవానికి ఈ సినిమా దీపావళి పండుగ సందర్భంగా విడుదల కావాల్సి ఉండగా, కొన్ని కారణాల వల్ల వాయిదా పడింది. తాజాగా ఈ చిత్రాన్ని డిసెంబర్ 24న క్రిస్మస్ కానుకగా తెలుగు, తమిళం, హిందీ భాషల్లో ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం ప్రకటించింది. రోమియో పిక్చర్స్ సంస్థ వరల్డ్‌వైడ్ డిస్ట్రిబ్యూషన్ హక్కులను సొంతం చేసుకోగా, లహరి మ్యూజిక్ సంస్థ ఆడియో హక్కులను దక్కించుకుంది.



పెళ్లి కంటే సరైన బంధమే నాకు ముఖ్యం: నిత్యా మేనన్

ప్రముఖ నటి నిత్యా మేనన్ తన వ్యక్తిగత జీవితం, పెళ్లికి సంబంధించిన అంశాలపై వస్తున్న వార్తలపై స్పష్టతనిచ్చారు. తాను వివాహ వ్యవస్థకు వ్యతిరేకం కాదని, సరైన వ్యక్తి దొరికితే తప్పకుండా పెళ్లి చేసుకుంటానని ఆమె వెల్లడించారు. ఓ పాడ్‌కాస్ట్ ఇంటర్వ్యూలో మాట్లాడిన ఆమె, తన పెళ్లి ఆలోచనలు, గత సంబంధాలపై పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. తన అభిప్రాయాలను కొందరు తప్పుగా ప్రచారం చేస్తున్నారని నిత్యా మేనన్ పేర్కొన్నారు. "నేను పెళ్లి చేసుకోను అన్నప్పుడు చాలామంది నన్ను వివాహానికి వ్యతిరేకి అని భావించారు. కానీ నా ఉద్దేశం అది కాదు. నాకూ పెళ్లి చేసుకోవాలనే కోరిక ఉంది. అయితే కేవలం పెళ్లి చేసుకోవడమే లక్ష్యం కాదు, నన్ను అర్థం చేసుకునే సరైన భాగస్వామితో మంచి బంధం ఏర్పడాలి. నాకు స్వేచ్ఛనిచ్చే వ్యక్తి దొరికితేనే వివాహం చేసుకుంటాను. లేదంటే పెళ్లి చేసుకోను" అని ఆమె స్పష్టం చేశారు.

Edited, Published and owned by **PAMANAGUDNDLA NAVEEN KUMAR,** Printed at **SRI printers** at H.No. 1-47/1, Ganesh Nagar, Dandampelly, Nalgonda , Telangana State : Editor, **PAMANAGUDNDLA NAVEEN KUMAR** : **RNI No. TELTEL 2023/88559**, Cell : **9553276552,**